


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 14-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 265 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## రాష్ట్రపతికి ఘనస్వాగతం

- స్వాగతం పలికిన సీఎం వైఎస్ జగన్, గవర్నర్ • ఏపీలో రెండు రోజుల పాటు రాష్ట్రపతి పర్యటన





రేణిగుంట: రాష్ట్ర పర్యటనలో భాగంగా రేణిగుంట చేరుకున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గవర్నర్ నరసింహన్ దంపతులు, ఏపీ సీఎం జగన్ తదితరులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో రేణిగుంట చేరుకున్న ఆయన రేణిగుంట నుంచి తిరుపతికి చేరుకుని తర్వాత తిరుచానూరు వెళతారు. పద్మావతి అమ్మవారిని దర్శించుకుని రాత్రి తిరుమల చేరుకుంటారు. ఆదివారం ఉదయం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం నెల్లూరులోని ఇస్రో కేంద్రానికి చేరుకుంటారు. సోమవారం చంద్రయాన్-2 ప్రయోగాన్ని వీక్షించనున్నారు.

## పీపీఏల పునఃసమీక్ష పై ఆలోచించండి

### సీఎం జగన్‌కు కేంద్రం లేఖ

### అవినీతి రహిత పాలనకు కేంద్రం సహకరిస్తుంది



అమరావతి: విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు సంబంధించి ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు కేంద్రం మరో లేఖ రాసింది. పీపీఏల పునఃసమీక్షపై మరోసారి ఆలోచించాలని కేంద్ర సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ సహాయ మంత్రి ఆర్‌కే సింగ్ లేఖలో పేర్కొన్నారు. పారదర్శక, అవినీతి రహిత పాలనకు కేంద్రం కూడా సహకరిస్తుందని, ఈ తరుణంలో తీసుకున్న అనూహ్యమైన నిర్ణయాలు పెట్టుబడులపై ప్రభావం చూపే అవకాశముందని మంత్రి సూచించారు.

భారత్‌లోని సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రాజెక్టులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని ఆర్‌కే సింగ్ తెలిపారు. దేశంలో సౌర, పవన రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. పెట్టుబడులకు ఆటంకం కలిగితే దేశవ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు ఆగిపోయే ప్రమాదముందని, చట్టానికి లోబడి అన్ని అంశాలను పరిష్కరించుకోవాల్సి ఉందని తెలిపారు.

గతంలోనూ ఇదే విషయంపై ఏపీ ప్రధాన కార్యదర్శికి కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి లేఖ రాశారు. మరోవైపు పీపీఏలను పునఃసమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. సీఎం జగన్ దీనిపై ఓ కమిటీని నియమించారు. తాజాగా కేంద్ర సహాయ మంత్రే స్వయంగా లేఖ రాయడంతో ఏపీ ప్రభుత్వం పీపీఏలపై పునరాలోచించే అవకాశం కనిపిస్తోంది.

## వీఐపీలూ.. తిరుమలకు ఏడాదికోసారే రండి

### 16న ప్రత్యేక దర్శనాలు రద్దు



తిరుపతి: తిరుమలలో త్వరలో వీఐపీలకు ఇస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3 దర్శనాలను రద్దు చేస్తామని తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టంచేశారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వీఐపీలు సైతం ఏడాదిలో ఒకసారే శ్రీవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తితిదే పాలకమండలి సభ్యులను 10 రోజుల్లో సీఎం నియమిస్తారని వెల్లడించారు. అంతకుముందు తిరుపతిలో తితిదే బర్డ్ ఆస్పత్రిని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్య సేవలు,

తరువాయి 2లో..

## బాహుబలి కోసం 7,134మంది నమోదు

### ప్రత్యక్షంగా చూసేందుకు ఇస్రో ఏర్పాట్లు



వార్త 2లో..

## బీసీల అభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ : పార్థసారధి



అమరావతి : మాజీ సీఎం చంద్రబాబు బీసీలను మోసం చేస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ముఖ్యమంత్రిగా నిరూపించుకున్నారు అన్నారు ఎమ్మెల్యే పార్థసారధి. రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ.. చరిత్రలో బీసీలకు ఇన్ని నిధులను ఎప్పుడు కేటాయించలేదని తెలిపారు. బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన మాట ప్రకారం బడ్జెట్‌లో రూ. 15 వేల కోట్లు కేటాయించారన్నారు. ఆటోడ్రైవర్లు, టైలర్లు, చేనేతలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి వారికి అండగా నిలిచారని ప్రశంసించారు. ఈ బడ్జెట్ బీసీల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు దోహదం చేస్తుందన్నారు.

## వీఎంఆర్డీఏ ఛైర్మన్ గా ద్రోణంరాజు శ్రీనివాస్

### ఉత్తర్వులు జారీ చేసిన జగన్ సర్కార్



విశాఖపట్నం : ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి వరుసగా నియామకాలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డి తాజాగా మరో కీలక పోస్టును భర్తీ చేసారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన విశాఖపట్నం మెట్రో రీజియన్ డవలప్ మెంట్ అథారిటీ ఛైర్మన్ గా మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ ను నియమించారు. ఈ మేరకు శనివారం నియామకపు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది.ఈ నియామకం ద్వారా వీఎంఆర్డీఏ తొలి ఛైర్మన్ గా ద్రోణంరాజు శ్రీనివాస్ ప్రత్యేక గుర్తింపును

తరువాయి 2లో..

## ఫైనల్‌కు తప్పిన వరుణుడి ముప్పు

లండన్: భారత్‌సన్యూజిలాండ్ సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రాకతో టీమిండియాకు విజయావకాశాలు సంక్లిష్టమైన సంగతి తెలిసిందే. సెమీస్‌లోనే కాకుండా లీగ్‌దశలోనూ ఎన్నో మ్యాచ్‌లకు వర్షం ఆటంకం కలిగి

తరువాయి 2లో..

## రాజధానికి రూ.500 కోట్లా?.. ఏం కడదామనో!

### అమ్మఒడి పథకానికి అన్ని ఆంక్షలా?

### ఏపీ బడ్జెట్‌పై చంద్రబాబు విమర్శలు



అమరావతి: జగన్ పాలనలో రానున్న రోజులు ఎంత అధ్వానంగా ఉండబోతున్నాయో వైకాపా ప్రవేశపెట్టిన బడ్జెట్ స్పష్టం చేసిందని తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. అమ్మఒడి పథకానికి అన్ని ఆంక్షలా? అని ప్రశ్నించారు. హామీ ఇస్తే అమలు చేసే సత్తా ఉండాలని, ఆ సత్తాగానీ, చిత్తశుద్ధిగానీ వైకాపా ప్రభుత్వానికి లేదంటూ ట్విటర్‌లో దుయ్యబట్టారు. జగన్ నోటికొచ్చిన హామీలతో చిటికెల పందిరి కట్టారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఇక ఆ పందిరి మీద అభివృద్ధి, సంక్షేమాన్ని పాకించి పండిస్తామంటున్నారని, ఇది అయ్యే పనేనా? అని ప్రశ్నించారు. రాజధానికి రూ.500 కోట్లు, కడప స్టీల్‌ప్లాంట్‌కు రూ.250 కోట్లు కేటాయించి ఏం కట్టాలనుకుంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షల్ని ఎందుకిలా నీరు గార్చుతున్నారని మండిపడ్డారు. డ్వాక్రా మహిళలకు 5 ఏళ్ల

తరువాయి 2లో..







# మానవ మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలి

## - విశాఖ రేంజ్ డిఐజి ఎల్.కాళిదాస్ వెంకట రంగారావు - ఒక్క రోజునే 50వేల మొక్కలు నాటిన పోలీసులు



విజయనగరం: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో "వనం..మనం" కార్యక్రమాన్ని పోలీసు పరేడ్ గ్రౌండులో శుక్రవారం భారీగోపట్టి, ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్. కాళిదాస్ వేంకట రంగారావు ముఖ్య అతిధిగా హాజరుకాగా, జిల్లా కలెక్టరు డా॥ ఎం. హరి జవహర్‌లాల్ మరియు జిల్లా ఎస్పీ బి. రాజకుమారి పాల్గని, మొక్కలను నాటారు.ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డిఐజి ఎల్. కాళాదాస్ వేంకట రంగారావు మాట్లాడుతూ - పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం "వనం..మనం" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో విశాఖపట్నం రేంజ్ పరిధిలోలక్ష మొక్కలను నాటేందుకు నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా వియనగరం జిల్లాలో ఒక్క రోజునే 50వేలమొక్కలను నాటే బృహత్తర ప్రణాళికను చేపట్టామన్నారు. మొక్కలకు, మనుష్యులకు అవినావ సంబంధం ఉందని, మనంఆక్సిజన్ పీల్చుకొని కార్బన్‌డయాక్సైడ్‌ను విడిస్తే, మొక్కలు కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకొని మనకు ఆక్సిజన్‌ను విడిచిపెట్టి, మనకు సహాయ పడుతున్నాయన్నారు. కావున, మానవ మనుగడ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచాల్సినఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రతీ వ్యక్తి ఒక మొక్కను నాటి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలన్నారు. అదే విధంగాప్రతీ కుటుంబం కనీసం 10మొక్కల సంరక్షణ బాధ్యతను చేపట్టి, పర్యావరణ పరిరక్షణలో తమ వంతు కృషిని చెయ్యాలన్నారు. పర్యావరణ పరిరక్షించి నట్లయితే వర్షాలు సకాలంలో పడతాయని, రైతులు, ప్రజలు ఆనందంగా ఉంటారని, నేరాలు తగ్గుముఖం పట్టి పరోక్షంగా పోలీసుశాఖకు సహాయపడతాయని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్. కాళిదాస్ వేంకట రంగారావు అన్నారు. జిల్లా కలెక్టరు డా॥ ఎం. హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ విజయనగరం జిల్లాను హరిత స్వర్ణంగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఖాళీగా, వృధాగా ఉన్న ప్రదేశాలను గుర్తించి, వాటిలో మొక్కలను నాటేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ముందుగా పార్కులు, రోడ్లుకు ఇరువైపులా,పాపింగు కాంప్లెక్సులు, అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్‌లు, కాలనీలు, ఇంటి ఆవరణంలోని ఖాళా మొక్కలను నాటేందుకుప్రణాళిక రూపొంది స్తున్నామన్నారు. మొక్కలను సంరక్షించే వారికి బంగారు కాయిన్ కూడా ఇచ్చే పథకాన్ని జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో అన్ని శాఖలను భాగస్వామ్యులను చేస్తున్నామన్నారు. అదే విధంగా పశువులను అనవసరంగా మొక్కలున్న ప్రాంతాల్లో వదిలిపెట్టవద్దని ప్రజలకు జిల్లా కలెక్టరు డా॥ ఎం. హరి జవహర్‌లాల్ విజ్ఞప్తి చేసారు.జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లు, సర్కిల్, డిఎస్పీ కార్యా లయాలు, పోలీసు క్వార్టర్సు, పోలీసుశాఖకు చెందిన ఖాళీ ప్రదేశాల్లోను, దత్తత పాఠశాలలు, కళాశాల్లో విశాఖ రేంజ్ డిఐజిగారి పిలుపు మేరకు 50వేల మొక్కలను నాటుతున్నామన్నారు. పోలీసు ప్రాంగణాలను పచ్చని మొక్కలుతో ఆహ్లాదకరంగా మార్చేందుకు కృషి చేస్తున్నా మన్నారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా నేరేడు, వేప, కాము, బాదం, సపోటా మొక్కలను నాటుతున్నా మన్నారు. అకాల వర్షాలు, వరదలు, వాతావరణ కాలుష్యం, విపత్తులకు ప్రధానకారణాలు ప్రధానంగా వాతావరణంలో సమతుల్యం లేకపోవడమే నన్నారు. వాతావరణంలో సమతుల్యానికి ప్రతీ పౌరుడువిధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్. కాళిదాస్ వేంకట రంగారావు, జిల్లా కలెక్టరు డా॥ ఎం. హరి జవహర్‌లాల్, జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, అదనపుఎస్పీ ఎం. నర్సింహారావు, జె. రామ్మోహనరావులు,గ్రౌండులో మొక్కలను నాటారు.



విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా నియమితులయిన ద్రోణంరాజు శ్రీనివాస్‌ను బెహరా భాస్కరరావు కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## నదీ..సాగర దేవాలయంలో ప్రత్యేక పూజలు

విజయనగరం : జిల్లాలో ఏకైక నదీ సాగర సంగమ తీర్థంగా వినుతికెక్కిక కోనాడ గ్రామంలోని 9వ శతాబ్దం నాటి శ్రీవేణు గోపాల స్వామి దేవాలయంలో శయన ఏకాదాశి పర్వదినంలో మూలవిరాట్లుకు పంచామృత, పళ్ళ రసాల, గంధ, విభూది, సుగంధద్రవ్యాల విశేష అభిషేకాన్ని నిర్వహించారు. ఇందులో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## రాజాం తహశీల్ధార్‌గా వేణుగోపాలరావు

రాజాం : రాజాం మండల తహశీల్దార్‌గా పి.వేణుగోపాలరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీలు, వీఆర్వోలు, ఆర్ఐలు తదితరులు పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తిరుగు రథయాత్రను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



అనకాపల్లి : జగన్నాధస్వామి తిరుగు రథయాత్రను అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి, శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాథ్ శనివారం ప్రారంభించారు. పట్టణంలోని గూడ్స్ షెడ్ వద్ద ఉన్న ఇంద్రజ్యమ్మ హాలు నుండి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తిరుగు రథయాత్ర ప్రారంభమైంది. ముందుగా ఎంపీ, ఎమ్మెల్యేలు రథాన్ని లాగి, యాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా భక్తులు స్వామివారికి అనుగుణంగా నినాదాలు చేసారు. ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అమర్‌నాద్ హాజరయ్యారు. పురోహితులు, పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ప్రసాదాలను స్వామివారి చిత్రపటాన్ని అందజేసారు. ఈ రథయాత్ర మల్లవీధి, కోట్ని వీధి, పెరుగుబజార్ మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాడి రత్నాకర్, డాక్టర్ విష్ణు మూర్తి, పలక రవి, పట్టణ వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, ఆళ్ల నాగేశ్వర రావు, చైర్మన్ దాడి ఈశ్వరరావు, యల్లపు చంద్ర మోహన్, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ విజయోత్సవ సభను జయప్రదం చేయాలి



అనకాపల్లి : పట్టణంలో విజయరామరాజుపేటలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు జరిగే వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ విజయోత్సవ సభను జయప్రదం చేయాలని పట్టణ వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేసారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పలక రవి ఆద్వర్యంలో జరిగే ఈ విజయోత్సవ సభకు శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాథ్ పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి సత్యవతులు ముఖ్య అతిధులుగా హాజరవుతారని విజయోత్సవ ర్యాలీ అనంతరం వీరిని సత్కరించడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు రాష్ట్ర పార్టీ కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, విశాఖ రూరల్ జిల్లా పరిశీలకులు దాడి రత్నాకర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ముఖ్య అతిదులుగా హాజరవుతారని తెలిపారు. నియోజవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సకాలంలో విచ్చేసి సభను విజయవంతం చేయాలని నాగేశ్వరరావు కోరారు.

# విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన వై.యస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు



విశాఖపట్నం : విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సాధారణ విద్యకు 32,618 కోట్లు కేటాయించడం హర్షణీయమని దీనికి విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆంధ్రాయూనివర్శిటీలో జరిగిన వై.యస్.ఆర్.స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో వై.యస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగం, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ,

"జగనన్న అమ్మఒడికింద పంపించే తల్లులకు రూ॥15000/-లు చొప్పున సాయం అందించేందుకు 6,455 కోట్లు కేటాయించడం వలన 43 లక్షల మంది లబ్ధి పొంది, వంద శాతం అక్షరాస్యత సాధించుటకు దోహపడుతుందని అన్నారు. ఉన్నత విద్యాభ్యాసానికి "జగనన్న విద్యాదీవెన" అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు నూరుశాతం ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఈ పథకం క్రింద అందుతుంది. ఆహారం, ప్రయాణం, హాస్టల్, పుస్తకాలకు ప్రతి సంవత్సరం 20 వేల రూపాయలు కేటాయించడం హర్షనీయమని ఇది ఉన్నత విద్యాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. గిరిజన యూనివర్శిటీని పాడేరులో స్థాపించటం వలన గిరిజనుల అభివృద్ధి గురించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి ఎంత ప్రేముందో అర్థమవుతుంది. ఆంధ్రా యూనివర్శిటీలో 238 కోట్లు కేటాయించటాన్ని హర్షం వ్యక్తం చేస్తున్నాము" అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై.యస్. ఆర్.సి.పి. విద్యార్థి విభాగం, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శులు ఎం.సురేష్, ఎం.కళ్యాణ్, విద్యార్థి నాయకులు సుధీర్‌పాల్, వీరక్రిష్ణ, రఘు, అనిల్, విజయకృష్ణ, వెంకటేష్, త్రినాధ్ మరియు అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వీఐపీలూ.. తిరుమలకు ఏడాదికోసారే రండి

సదుపాయాలపై ఆరా తీశారు. శ్రీవారి ఆలయంలో ఈ నెల 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనుండడం, రాత్రి చంద్రగ్రహణం కారణంగా అన్ని రకాల ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. వయోవృద్ధులు, దివ్యాంగులకు, ఏడాదిలోపు చంటిబిడ్డలతోపాటు తల్లిదండ్రులకు నిత్యం కల్పించే ప్రత్యేక దర్శనాలను ఆ రోజు రద్దు చేసింది. 17న అంగప్రదక్షిణ సేవ కూడా ఉండదు. 16న కేవలం 5 గంటలపాటు మాత్రమే శ్రీవారి దర్శన అవకాశం ఉంటుంది.

## వీఎంఆర్డీఏ చైర్మన్‌గా ద్రోణంరాజు శ్రీనివాస్

### ఉత్తర్వులు జారీ చేసిన జగన్ సర్కార్

పొందనున్నారు. వీఎం ఆర్డీఏ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు ఈ పోస్టును భర్తీ చేయలేదు. అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థగా వీఎంఆర్డీఏ ఆవిర్భవించింది. గతంలో విశాఖ నగరాభివృద్ధి సంస్థ (వుడా) పేరు మీద కార్యకలాపాలు సాగించింది. అయితే అనూహ్యంగా గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వుడా పరిధిని నాలుగు జిల్లాలకు పెంచుతూ వీఎమ్ ఆర్డీఏగా మార్చారు. విశాఖతో పాటుగా విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల పరిధి వరకు ఈ సంస్థ విస్తరించి ఉంది. మహా విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటుగా ఈ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్నపొరుగుజిల్లాలను కూడా సమాంతరంగా అభివృద్ధి చేయడం, వసుతలు, వనరులను వినియోగించుకుని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ సంస్థను ఏర్పాటు చేసారు. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఒకటిగా విశాఖ ను తీర్చిదిద్దాలన్నది వీఎమ్ ఆర్డీఏ లక్ష్యం. అయితే వుడాను వీఎంఆర్డీఏ గత ప్రభుత్వం మార్చినప్పిటికీ, దీనిపై పెద్దగా దృష్టి సారించినది లేదు. ఈ సంస్థ చైర్మన్ తో పాటుగా బోర్డును కూడా నియమించలేదు. అయితే ఇప్పుడు కొత్తగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీఎమ్ఆర్డీఏపై దృష్టి పెట్టింది. నగరానికి అత్యంత కీలకమైన ఈ సంస్థకు చైర్మన్ గా ద్రోణంరాజు ను నియమించింది. ద్రోణంరాజు శ్రీనివాస్ కు విశాఖ నగరం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. ఎమ్మెల్యేగా పనిచేయడంతో పాటుగా నగరం అభివృద్ధి పట్ల ఆయనకు అవగాహన ఉన్నందున ముఖ్యమంత్రి ఈ కీలకమైన పోస్టులో నియమించినట్లు రాజీకయవర్గాలు చెబుతున్నాయి. కాగా, శ్రీనివాస్ తండ్రి స్వర్గీయ ద్రోణంరాజు సత్యనారాయణ కూడా గతంలో వుడా చైర్మన్ గా పని చేసారు. ఇప్పుడు ఆయన తనయుడు శ్రీనివాస్ కూడా అదే సంస్థకు చైర్మన్ గా నియమితులు కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## బాహుబలి కోసం 7,134మంది నమోదు

### ప్రత్యక్షంగా చూసేందుకు ఇస్రో ఏర్పాట్లు

చెన్నై: బాహుబలిగా పేరొందిన భారత ఉపగ్రహ వాహకనౌక జియోసింక్రోనస్ శాటిలైట్ లాంఛ్ వెహికల్-మార్క్ (జీఎస్ఎల్‌వీ-ఎంకే III) ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఇప్పటి వరకు 7,134మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్, రెండో లాంఛింగ్ ప్యాడ్ నుంచి జులై 15న తెల్లవారుజామున 2:15గంటలకు బాహుబలిని ప్రయోగించనున్నారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) చంద్రయాన్-2లో దీన్ని ప్రయోగించనుంది. ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది అన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. బాహుబలి ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు సాధారణ ప్రజలకు అవకాశం కల్పించాలని ఇస్రో నిర్ణయించింది. ఇందుకోసం ఇస్రో అధికారులు పదివేల మంది కూర్చునే సామర్థ్యం ఉన్న గ్యాలరీని ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. వీక్షకుల సంఖ్యను కొద్దికొద్దిగా పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రయోగాన్ని ప్రజలు ప్రత్యక్షంగా చూసేందుకు సూళ్లూరుపేట నుంచి రాకెట్ లాంఛింగ్ కేంద్రం వరకు రవాణా సౌకర్యం కల్పించాలని ఇస్రో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది.

## రాజధానికి రూ.500 కోట్లా?..ఏం కడదామనో!

పాటు రూ.75 వేలు ఇస్తామన్నారు.. డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామన్నారు. బడ్జెట్‌లో వాటి గురించి చెప్పకుండా సున్నా వడ్డీ రుణాలకు రూ.1,788 కోట్లు కేటాయించి చేతులు దులిపేసుకున్నారు అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## ఫైనల్‌కు తప్పిన వరుణుడి ముప్పు

ంచింది. దీంతో నాలుగు మ్యాచ్‌లు ఎటువంటి ఫలితం తేలకుండా ముగిశాయి. అయితే ప్రపంచకప్‌లోని తుదిపోరుకు మాత్రం వరుణుడు వచ్చే అవకాశం లేదని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. రేపు లార్డ్సులో జరిగే ఇంగ్లాండ్సన్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్‌లో వర్షం పడే అవకాశం లేదని, ఉష్ణోగ్రత 21-23 డిగ్రీల సెల్సియస్ ఉంటుందని తెలిపింది. తుది పోరుకు సిద్ధమవుతున్న ఇంగ్లాండ్, న్యూజిలాండ్ ఇప్పటికీ 90 వన్డేల్లో తలపడ్డాయి. న్యూజిలాండ్ 43 మ్యాచ్‌లు, ఇంగ్లాండ్ 41 మ్యాచ్‌ల్లో గెలవగా రెండు టైగా మారాయి. నాలుగు మ్యాచ్‌ల ఫలితం తేలలేదు. ప్రస్తుత ప్రపంచకప్‌లోని లీగ్ మ్యాచ్‌లో కివీస్‌ను ఇంగ్లాండ్ 119 పరుగుల తేడాతో చిత్తుచేసింది.

## పాలిసేట్ తుడివిడత కౌన్సిలింగ్

### ఈనెల 16 నుంచి 18 వరకూ

భీమునిపట్నం: భీమునిపట్నం పాలిసేట్ లో అర్హత సాదించి సీటులు రానివారు ఈనెల 16 నుంచి 18 వరకూ తుదివిడత కౌన్సిలింగ్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని గవర్నమెంట్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వి శ్రీనివాసరావు తెలియజేశారు.

# రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ముగింపు



భీమునిపట్నం: భీమిలి వుడా మైదానంలో రాష్ట్రస్థాయి సుబ్రతో ముఖర్జీ ఫుట్ బాల్ పోటీ అండర్ 14 బాలురు, అండర్ 17 బాల బాలికలకు ఫుట్ బాల్ పోటీలు శనివారం ఘనంగా ముగిసాయి . ఈ పోటీలో 13 జిల్లాలకు చెందిన 39 జట్లు పాల్గొన్నాయి. ఈ ఫుట్ బాల్ పోటిల్లో అండర్ 14 బాలురు విభాగంలో కడప జట్టు వినర్స్ గా ,రనర్స్ గా అనంతపురం జట్టులు నిలిచాయి ,అలాగే అండర్ 17 బాలికల విబాగం లో వినర్స్ గా కడప జట్టు , రనర్స్ గా కర్నూలు జట్టులు నిలిచాయి, అండర్ 17 బాలురు విభాగం లో విజయనగరం జట్టు విన్నర్స్ గా, రనర్స్ గా అనంతపురం జట్టులు నిలిచాయి. వీరికి మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర రావు, సెట్విస్ సీఈఓ గీతాంజలి లు విజేతలకు విన్నర్స్ ట్రోపి లో అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ బాల బాలికలు క్రీడాస్ఫూర్తితో ఆడాలని అన్నారు. గెలుపు ఓటములతో సంభందం లేకుండా పోటీలో పాల్గొనాలని ఇటువంటి పోటీలు వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని అందులో భాగంగానే తొలిసారిగా రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలు నిర్వహించడం అని హర్షణీయం అన్నారు. ఇందులో గెలుపొందిన జట్లు ఆగస్టు లో ఢిల్లీ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాయని వారు అక్కడ చక్కని ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేవిధంగా ముందుకు సాగాలని కోరారు. విద్యార్థులు మరియు యువతకు ఇది స్ఫూర్తిదాయకమన్నారు.

ఈ కార్యక్రమంలో భీమిలి జోనల్ కమిషనర్ సి హెచ్ గోవిందరావు, సుబ్రతో ముఖర్జీ ఫుట్ బాల్ టోర్నమెంట్ అడ్వైజర్ శ్రీనివాసరావు , స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ జూన్ గ్లొరియట్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లలిత్ కుమార్ ,పి ఇ టి ల అసోసియేషన్ మెంబెర్ సోమరాజు, అధికారులు వైసీపీ నాయకులు పెదబాబు, చందక బంగారు నాయుడు, శ్రీకాంత్ రాజు,సుంకరి గిరిబాబు, ఎస్.కరుణాకర్ రెడ్డి ,మైలపల్లి షణ్ముఖరావు, మాజీ కౌన్సిలర్ లు అక్రమాని రామునాయుడు, మైలపల్లి.లక్ష్మణరావు, జగ్గుపల్లి ప్రసాద్, వాసుపల్లి కొండబాబు,అల్లిపిల్లి నరసింగరావు, గుండాసు మధునాయుడు, డింగి హరికిరణ్ రెడ్డి , జీరు వెంకట రెడ్డి, జీరు సుజాత రెడ్డి, పాల్గొన్నారు.

# శయనమూర్తిగా దర్శనమిచ్చిన చోడవరం జగన్నాథస్వామి



చోడవరంలో శయన మూర్తి అలంకరణలో పూజలందుకుంటున్న జగన్నాథస్వామి వారు.

చోడవరం : చోడవరం పట్టణంలోని బోళ్లవీధి రామాలయం ఇంద్రజ్యుమ్నంలోని జగన్నాథ స్వామి వారు శేషపాన్పుపై శయన మూర్తిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన రామ కృష్ణమాఛార్యులు, సుదర్శన సీతారామా ఛార్యులు, సుదర్శన సీతారామ కుమార్ ఆధ్వర్యంలో

జగన్నాథ స్వామి వారిని శయన మూర్తిగా విశేష అలంకరణ నిర్వహించి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించు కున్నారు.

# టీడీపీపార్టీ భీమిలి డివిజన్ అత్యవసర సమావేశం




భీమునిపట్నం : టీడీపీ పార్టీ భీమిలి డివిజన్ అత్యవసర సమావేశం స్థానిక పార్టీ కార్యాలయం లో డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు, ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్ ఆధ్వ ర్యంలో జరిగింది. సార్వ త్రిక ఎన్నికలు జరిగిన తరువాత మొదటి సమా వేశం కావడంతో అధిక సంఖ్యలో పార్టీ నాయ కులు కార్యకర్తలు పాల్గొనడంతో అధిక ప్రాధా న్యత సంతరించుకుంధి ఈ సమావేశాన్ని ఉద్దే శించి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీ గెలిచే చోట కూడా అపజయానికి కారణం జనసేన ఒకటైతే రెండవది ప్రధాని నరేంద్రమోడీ, కె.సి.ఆర్ లు . కలసి ఆడిన మైండ్ గేమ్ తప్ప ఇంకేమీ కాదని పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ తెలుగుదేశం పార్టీ పై అపార నమ్మకం ఉందని అప్పటికి ఎప్పటికి వారే పార్టీ ప్రతిష్టకు అండ అని గంటా నూకరాజు తెలియజేసారు. కార్యకర్తలు ఎప్పుడూ అధైర్య పడవద్దని ఏ సందర్భంలో అయినా ఏ సమయం లోనైనా మీవెంట మేమున్నామని భరోసా ఇచ్చారు. పార్టీ అధికారంలో ఉన్నా లేక పోయినా అధికారులతో పనులు చేయించు కొని సత్తా ఉందని మీకు అండగా 24 గంటలూ అందు బాటులో ఉంటామని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. మన భీమిలి డివిజన్ లో తెలుగుదేశం పార్టీకి అఖండ మెజారిటీని ఇచ్చారని, రాష్ట్రమంతా పరిస్థితి ఎలా ఉన్నా మన డివిజన్ లో మెజారిటీ ఇచ్చారని అలాంటి ఓటరులకు అదేవిధంగా పార్టీ కార్యకర్తలకు మనం అందు బాటులో ఉండాలని అన్నారు. రానున్న విశాఖ పట్నం కార్పొరేషన్ ఎన్నికల్లో మన సత్తా ఏంటో నిరూపించాలని, ప్రజలందరూ మన పక్షానే ఉన్నారని కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కాక ముందే ప్రజల్లో వ్యతిరేకత ఉందని, పరిపాలన నారా చంద్రబాబు నాయుడు మీద కక్ష సాధింపుకోసం చేస్తున్నట్లు ఉన్నాదని, రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్తకు భరోసా ఇస్తే ఘన విజయం సాధిస్తామని అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు ఎన్నడూ ఇలాంటి సమావేశాలు జరగలేదని ఎక్కువ మంది శాసనసభ్యులు ఉన్నారనే అతి గర్వంతో మాట్లాడుతున్నారని త్వరలో వీరికి సరైన గుణపాఠం జరుగుతుందని గంటా నూకరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు మారోజు సంజీవ కుమార్, కనకల అప్పలనాయుడు, గిడుతూరి శ్రీనివాసరావు, ఊళ్ళ దుర్గారావు, కొక్కిరి అప్పన్న, అప్పికొండ నూకరాజు, పైడిపల్లి ఎల్ల య్యమ్మ, పుక్కళ్ళ లక్ష్మి కుమారి, పైడిపల్లి నర్సింగరావు, కంచెర్ల కామేష్, వియ్యపు పోతు రాజు, దాసరి వేణుగోపాల్, కందుల సుందర్ రావు, గండి రాజు వాసుపల్లి వంశీ పాల్గొన్నారు.

# వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి మత్స్యకారులు పాలాభిషేకం



భీమునిపట్నం : 2019-2020 రాష్ట్ర బడ్జెట్లో మత్స్యకారుల సంక్షేమానికి సుమారు ఐదు వందల కోట్లు కేటాయించడం తో దీన్ని భీమిలి రూరల్ మండలం కె నగర పంచాయతీ మంగమారిపేట చెందిన వైసీపీ యువ నాయకులు మేరుగు చిన్నారావు ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య కారులు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రుణం తీర్చుకోలేనిది అని అన్నారు వేట నిషేధ సమయంలో నాలుగు వేల రూపాయలని పదివేలు చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసు పల్లి. నరసింగరావు, బడే చిన్నారావు,తదితరులు పాల్గొన్నారు.

# సింహగిరి ప్రదిక్షిణం చేయండి - భూప్రదిక్షణ ఫలం పొందండి



సింహాచలం : ఆంధ్రుల ఆరాధ్య దైవం ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు భక్తుల కొంగు బంగారం సింహగిరి కొండపై నారసింహునిగా సింహాద్రి అప్పన్నగా కొలువై యున్న ఆ సింహాద్రినాధునాధునికి జరిపే ప్రధాన ఉత్సవాలలో వొకటైన సింహగిరి ప్రదిక్షణ ఉత్సవం భక్తుల గుండెల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రదిక్షణ విధానం : ఈ ఉత్సవం ప్రతీయేడు ఆషాడ పౌర్ణమినాడు ఈ ఉత్సవాన్ని భక్తులు కొండ ద్రిగువ తొలిపావంచవద్ద కొబ్బరికాయకొట్టి సింహాచలం అడివివరం ముడసర్లోవ పెద్దగదిలి అప్పుఘర్ పార్కు చేరుకుని సముద్రం వడ్డున ఇసుకలో కొంతసేపు సేదతీరి పౌర్ణమి సముద్ర స్నానమాచరించి తిరిగి ప్రదిక్షణం కొనసాగిస్తారు సీతమ్మధార మీదుగా కైలాసపురం కప్పరాడ మాధవధార చేరుకుని మాధవస్వామిని దర్శించి తిరిగి ఎ న్ ఏ డి గోపాలపట్నం ప్రహ్లాదపురం గోశాలమీదుగా మొత్తం 32 కిలోమీటర్ల నడక అనంతరం సింహాచలం చేరుకుని మెట్లమార్గం గుండా సింహగిరి కి చేరుకుని అప్పన్న దర్శనంతో గిరి ప్రదిక్షణం పూర్తయినట్టుగా భక్తులు బావిస్తారు .

సింహగిరి కొండచుట్టు ప్రదిక్షణ కారణం :సింహాద్రినాధుని మొత్తం కొండ సింహం ఆకారం సంతరించుకోవడంతో సింహగిరి అనిపేరు .విష్ణుమూర్తి వొకనాడు నేను కొండలలో కొలువైయుంటాను కనుక కొండచుట్టు ప్రదిక్షణ చేస్తే భూప్రదిక్షణ ఫలితం కల్గుతుందని సెలవు ఇవ్వడంతో భక్తులు సింహగిరి కొండచుట్టూ తిరిగి ఈ ప్రదిక్షణ చేస్తారు శ్రీ వరాహలక్ష్మీ నారసింహ స్వామివారికి 32 కి దగ్గర సంభంధం గిరిప్రదిక్షణంలో కొండ చుట్టూ భక్తులు తిరిగే దూరం 32 కిలోమీటర్లు మరియు నారసింహ అవతారాలు 32 మరియు గిరిప్రదిక్షణం చేయలేని వారు పౌర్ణమి నాడు అప్పన్న ఆలయం చుట్టూ 32 ప్రదిక్షణలు ప్రతి పౌర్ణమినాడు సంవత్సర మొత్తం చేసి ప్రదిక్షణ ఫలం లభిస్తుందని పండితులు చెబుతారు సింహగిరి చుట్టూ భక్తులకోసం వివిద స్వచ్ఛంథ సంస్థలు సాధారణ భక్తులు ప్రదిక్షణ చేసిన భక్తులకొరకు భారీ ఎత్తున ప్రసాద వితరణ చేపడతారు రకరకాలైన కమ్మని పదార్ధాలు టి కాఫీ గ్లూకోస్ మొదలగు పదార్ధాలను అందించడంతో పాటుగా భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా దారి పొడుగున మెడికల్ క్యాంపులు మందులు అందిస్తారు అంతేకాకున్న ఎటువంటి అవాంఛనీయ సంగటనలు జరగకున్నా కొండ చుట్టూ పోలీసులు భక్తులకు రక్షణగా నిలుస్తారు .కనుక సోమవారంనాడు జరుగు గిరిప్రదిక్షణంలో పాల్గొని భూప్రదిక్షణ ఫలితం పొందాలని మీ విజయభాను పత్రిక కోరుకుంటుంది

# ఇంటర్వ్యూలకు రాని అభ్యర్థులకు మరో అవకాశం : ఎంపిడిఒ జయమాధవి

నర్సీపట్నం : వాలంటీర్ పోస్టుల ఇంటర్వ్యూలకు అనివార్య కారణాల వల్ల హాజరు కాని అభ్యర్ధులకు చివరి రోజున మరో అవకాశం కల్పిస్తామని ఎంపిడిఒ జయమాధవి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో వాలంటీర్ల పోస్టులకు ఆమెతో పాటు ఎంఇఒ సాయిశైలజ, ఈవోపిఆర్డి ప్రేమలీల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తొమ్మిది పంచాయతీల పరిధిలో 144 పోస్టులకు 703 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరందరికి షెడ్యూల్ విడుదల చేశామన్నారు. ఈ నెల 23 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

# పశువైద్యాధికారిని బదిలీ చేయవద్దు

కోటవురట్ల : కోటవురట్ల మండలం కె.వెంకటాపురం పశు వైద్యాధికారి నరేష్ బదిలీని రద్దు చేయాలని పలు గ్రామాలకు చెందిన పాడి రైతులు కోరుతున్నారు. అన్ని వేళల్లో అందుబాటులో అధికారిని బదిలీ చేయడానికి ఒప్పుకోమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చూస్తే ఐదేళ్లు నిండలేదని ఇంకా రెండేళ్ల పాటు కోటవురట్ల మండలంలో పని చేసే అర్హత ఉందన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని బదిలీ నిలిపివేయాలని కోరారు.

# నలుగురు వీఆర్వోలు, ఇద్దరు ఆర్‌ఐలు బదిలీ

గొలుగొండ : నలుగురు వీఆర్వోలు, ఇద్దరు ఆర్ఐలు బదిలీపై వెళ్లారు. ఆర్ఐ బాలంనాయుడు, గోవిందరావు, ఏఎస్ఒ శంకర రావు, వీఆర్వోలు కొంగసింగిలో పని చేస్తున్న వీఆర్వో కన్నయ్య, పాకలపాడు వీఆర్వో ఆర్.పెద్దన్నదొర, చీడిగుమ్మలలో పని చేస్తున్న లక్ష్మి, పప్పుశెట్టిపాలెంలో పని చేస్తున్న ఆర్.ఆనంద్‌రావు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో నలుగురు వీఆర్వోలు, ఇద్దరు ఆర్ఐలు ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై గొలుగొండకు రావల్సి ఉంది.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ సుభద్ర జగన్నాధస్వామి మారు రధోత్సవం



భీమునిపట్నం : శ్రీశ్రీశ్రీ సుభద్ర జగన్నాధస్వామి కళ్యాణ రధోత్సవ మహొత్సవాలు జూలై 3నుండి 12వరకూ ఘనంగా జరి గాయి. శనివారం భీమిలీ పురవీధుల్లో స్వా మి విగ్రహాలను రదం మీద ఉంచి వంశపారంపర్యప్రధాన అర్చకులు రొంపిచర్ల సింగరా చార్యులు ఆధ్వర్యంలో మారు రధోత్సవం రాత్రి 9గంట లకు తిరువీధి తరువాత వైకుంత మందిర ప్రవేశం,లక్ష్మీ జగన్నా యక సంవాదము వైభవంగా నిర్వహించారు. ఈ కార్యమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనీ తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.



శనివారం పాడేరు లోని శ్రీ మోదకొండమ్మ వారిని దర్శించుకుంటున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

# వాలంటీర్ల ఇంటర్వ్యూలను పరిశీలించిన ఆర్డీవో



ఇంటర్వ్యూల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో గోవిందరావు

మాకవరపాలెం : కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం నర్సీపట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావు మాకవరపాలెం ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతున్న వాలంటీర్ల ఇంటర్వ్యూలను పరిశీ లించారు. ఎంపిడిఒ అరుణశ్రీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 270 మందిని ఇంటర్వ్యూ చేశామని ఎంపిడిఒ వివరిం చారు. ఈ సందర్భంగా

ఆర్డీవో మాట్లాడుతూ పారదర్శకంగా ఇంట ర్వ్యూలు నిర్వహించా లన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# గ్రామాలలో ఘనంగా జగన్నాథస్వామి పండుగలు



గజపతినగరంలో అండీలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

చోడవరం : మండలంలోని పలు గ్రామాలలో జగన్నాథస్వామి పండుగను శుక్ర, శనివారాలు భక్తి, శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. గజపతి నగరం గ్రామంలో కాళ్ళ శంకర్‌రావు, శ్రీనివాస రావు, కన్నంనాయుడు, కాళ్ళ జగ్గారావు, కృష్ణ, ఆదిబాబు తదితరులు ఆధ్వర్యంలో అండీలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం జగన్నాధునికి వివిధ వంటకాలతో నైవేద్యం సమర్పించారు. అలాగే భక్తులకు భారీ అన్నదానం నిర్వహిం చారు.

# ద్రోణంరాజు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపిన కె.కె.రాజు

**విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా నియమితులయిన ద్రోణంరాజు శ్రీనివాస్ ను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.**



**వి.ఎం.ఆర్.డి.ఏ.ఏర్పడిన తరువాత మొదటి చైర్మన్ గా ద్రోణంరాజు శ్రీనివాస్ ని గౌరవనీయ ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్ జగన్మోహనరెడ్డి నియమించారు. ఈ నేపథ్యంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ , జీవీ, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దుశ్శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు.**



# 'పోస్కో' గోబ్యాక్ : సీపీఐ




విశాఖసిటీ: ఎన్నో పోరాటాలు ఆందోళనలు చేసి చివరకు 32 మంది ప్రాణలు త్యాగం చేసి ప్రభుత్వ రంగం లో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బీజేపీ కేంద్ర ప్రభుత్వం రెండోవసారి అధికారం లోకి రాగానే భాగస్వామ్యం పేరుతో దక్షిణ కొరియా ప్రైవేట్ పెట్టు బడిదారీ సంస్థ (పొహాంగ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ)'' పోస్కో'' కి కట్ట బేడితే సహించేది లేదని అందరినీ కలుపుకొని ఏంతటీ పోరాటానికైనా సిద్దపడి ప్లాంటును ప్రభుత్వ రంగం కొనసాగించడానికి పోరాడు తామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారయణమూర్తిహెచ్చరించారు. శుక్రవారం విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో '' పోస్కో'' గో బ్యాక్ అంటూ ఎత్తున నిరసనకు దిగారు. ఈ సంద ర్భంగా సత్యనారయణమూర్తి మాట్లా టడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమగా విశాఖ ఉక్కు నిర్వాసితు లకు,స్థానికులకు పూర్తిస్థాయి ఉపాది కల్పిస్తుందన్న ఉద్దేశం తో 26 వేల ఏకరముల పైచిలుకు భూములను రైతులు త్యాగం చేస్తే వాటిలో 4000 ఏకరాల భూమిని పోస్కో కి దారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతుందని దీన్ని అంగీకరించే ప్రశక్తి లేదన్నారు .పోస్కో కంపెని ఆంద్రా లో స్టీలు ప్లాంటు నిర్మాణానికి ముందుకు వస్తే విశాఖ ఉక్కు లో కాకుండా కడప లో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సలహాను పెడచెవిని పెట్టి విశాఖ ఉక్కు పైనే మక్కువ చూపడంలో ఉక్కు భూములతో పాటు విశాఖ ఉక్కు ను కబ్జా చేసే కుట్ర ఇందులో దాగి ఉందన్నారు. సంయుక్త భాగస్వామ్యం అంటూ రంగు పూసి పూర్తిగా ఈ పరిశ్రమ మింగేందుకు ఈ విదేశీ కంపెని కేంద్రం లో గల బీజేపీ ప్రభుత్వాన్ని లోబరుచుకుని గత అక్టోబరు నుండి కుట్రలు పన్నుతున్నారని వీరి రాజ్యాంగ ఉల్లంగణలపై ఇప్పటికే రాష్ట్రపతికి పిర్యాదు చేశామని, విచారణ జరుగుతున్న నేపద్యంలో మళ్ళీ పావులు కదపడం ఆందోళన కరమైనదని '' పోస్కో'' కంపెనీ ని నిలువరించేందుకు పోరాటంలో అన్ని రాజకీయ పక్షాలను ప్రజాస్వామ్య వాదులను వివిధ సంఘాలను బాగస్వాములను చేసి ప్రత్యక్ష పోరాటం చేసి ''పోస్కో'' ని పంపిస్తామని హెచ్చరించారు. .ఈ '' పోస్కో'' కంపెనీ ఒరిస్సాలో స్థాపించడానికి ప్రయత్నించగా 7 సం''రాలు పాటు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు అభయ్ సాహు నాయకత్వాన ప్రజలు ప్రజాస్వామ్య వాదులు పెద్ద ఎత్తున పోరాడి అక్కడ నుంచి తరిమి కొట్టారని , మనం కూడా విశాఖ ఉక్కు లోకి రాకుండా తరిమికొడదామనిపిలుపునిచ్చారు.ఈ నిరసన కార్య క్రమం లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.జె.స్టాలిన్, జిల్లా కార్యదర్శి సహాయ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జె. వి. ప్రభాకర్, నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల నగర కార్యవర్గ సభ్యులు డి. మార్కండే యులు డాక్టర్ బూసి. వెంకటరావు పైలా.ఈశ్వరరావు జి.వామన మూర్తి జె.డి. నాయుడు, ఎస్.కె.రెహమాన్, గుడాల.రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ, మహిళా నాయకులు ఎం డి బేగం ఎ దేముడమ్మ జి.జయ పార్టీ నాయకులు కె లక్ష్మణరావు కె మేఘరావు జి వేలంగినిరావు టి. ఎస్. సుకుమారన్ వై.త్రినాథ్ వై. రాంబాబు బి. శివప్రసాద్ కె.తవిటిరాజు ఆంధ్రప్రదేశ్ మత్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై నందన్న ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్ష లు వై. అప్పలరాజు కార్యదర్శి జి. పనీంద్ర ,ఉపాధ్యక్షులు జి. ఓబులేసు ఎ.ఐ.వై. ఎఫ్.జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు రాంప్రభు, ఎన్. బి. మూర్తి, విజ్ఞానంద్ధ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### అంతరిక్ష రక్షణ విధానం

అంతరిక్షంలో పరిశోధనశాలను నిర్మించతలపెట్టడం శాస్త్ర సాంకేతికరంగంలో భారత్ సాధిస్తున్న అభివృద్ధికి మరో సంకేతం. చంద్రుడి మీద పరిశోధనకు చంద్రయాన్-2 పథకాన్ని చేపట్టినట్టు, రోదసిలోకి భారతీయలను పంపేందుకు గగన్‌యాన్ పథకాన్ని చేపట్టినట్టు ఇస్రో మరుసటిరోజే అంతర్జాతీయ పరిశోధనశాలను నిర్మిస్తున్నట్టు వెల్లడించి సంచలనం సృష్టించింది. 2030 నాటికి ఈ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని భారత్ భావిస్తున్నది. భారత్ ఇతరదేశాల పొత్తులేకుండా సొంతంగా ఈ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించతలపెట్టడం కూడా విశేషమే. ఇప్ప టివరకు అమెరికా, రష్యా, చైనా దేశాలు మాత్రమే సొంత అంతరిక్ష కేంద్రాలను నిర్మించుకున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఈ మూడు పెద్ద దేశాలతో పాటు కెనెడా, జపాన్ తదితర దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. ఎంతోమంది శాస్త్రవేత్తలు ఐఎస్-ఎస్‌కు వెళ్లి అక్కడ పరిశోధనలు సాగించుకొని తిరిగివచ్చారు. మొదట భారతీయ శాస్త్రవేత్తలు రష్యా సహకారంతో ఐఎస్ఎస్‌కు వెళ్లి శిక్షణ పొందుతారు. ఆ తర్వాత మన సొంత అంతరిక్ష కేంద్రం సిద్ధం కాగానే అం దులో ప్రయోగాలు సాగిస్తారు. కొన్ని పరిశోధనలను భార రహిత స్థితిలో సాగించవలసి ఉంటుంది. ఔషధరంగంతో పాటు, ఖగోళ జీవశాస్త్రం, అనేక ఖగోళం, అంతరిక్షం, భౌతిక ధర్మాల పరిశీలన, వాతావరణం వంటి పలురంగాల్లో పరిశోధనలకు ఈ అంతర్జాతీయ పరిశోధనాశాల ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. భారత్ నిర్మించతలపెట్టేది మిగతా దేశాల మాదిరిగా భారీ పరిశోధనాశాల కాదు. అయినప్పటికీ మనకంటూ సొంత పరిశోధనశాల నిర్మించుకోవడమే గొప్పతనం. భారత్ ఆర్థికశక్తిగా ఎదుగుతున్న నేపథ్యంలో తన ప్రయోజనాల పరిరక్షణ కోసం భద్రతా ఏర్పాట్లు చేసుకోకతప్పదు. పొరుగునే ఉన్న చైనాను దృష్టిలో పెట్టుకొని భారత్ యుద్ధ వ్యూహాలను రూపొందించుకోవలసి వస్తున్నది. అంతరిక్షాన్ని యుద్ధానికి వేదికగా కాకుండా శాంతియుత అవసరాల కోసమే వాడుకోవాల నేది భారత్ సాంప్రదాయ విధానం. కానీ అంతర్జాతీయరంగంలో వచ్చిన మార్పుల వల్ల భారత్ కూడా ఈ దిశగా అడుగులు వేయక తప్పడంలేదు. అంతర్జాతీయ రంగంలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకునే పరిస్థితి లేదు. బలమైన రాజ్యాల మాటే చెల్లుబాటు అవుతున్నది. ఈ నేపథ్యంలో భారత్ ప్రపంచ శాంతికోసం తన వంతు ప్రయత్నాలను కూడా కొనసాగించాలె. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలోనే నెహ్రూ దార్శనికతతో పలు వైజ్ఞానిక రంగాల పరిశోధనల కు పునాది వేశారు. అణు శక్తి మొదలుకొని అంతరిక్ష శోధన వరకు భారత్ ఇవాళ ఈ దశలో ఉండటానికి ఆ పునాదులే కారణం. స్వాతం త్ర్యం వచ్చి 75 ఏండ్లవుతున్న సందర్భంగా గగన్‌యా న్ పథకం పేర 2022లో రోదసిలోకి భారతీయులను పంపాలని ఇస్రో నిర్ణయించడం సముచితంగా ఉన్నది. గగన్‌యాన్ పథకంలో భాగంగా మన శాస్త్రవేత్తలు వారం పదిరోజులు మాత్రమే గగనయానం చేసినా అది మనదేశ వైజ్ఞానిక రంగ చరిత్రలో మైలురాయి అవుతుం ది. భూ కక్ష్య లో పరిశోధనశాలను నిర్మించుకోవ డం కూడా ఈ గగన్‌యాన్ పథకానికి కొనసాగింపే. చంద్రయా న్-2, గగన్‌యాన్ రెండూ దేశం చేపట్టబోయే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులే. చంద్రుడి దక్షిణ ధ్రువం మీద పరిశోధనలను ఇప్పటివరకు ఏ దేశమూ చేయలేదు. భారత్ స్వయంగా చంద్రుడి తలం మీద తిరుగాడే పరికరాన్ని (రోవర్) దింపి పరిశోధనలు సాగించనుంది. ఇది మన దేశమే సొం తంగా చేపట్టబోయే ప్రాజెక్టు. వచ్చే నెల 15వ తేదీననే మన అంతరిక్ష నౌక చం ద్రుడి వైపుగా ప్రయాణం సాగించబోతున్నది. భవిష్యత్తులో చంద్రుడి మీద స్థావరాలను నెలకొల్పడం, అక్క డి వనరులను ఉపయోగించుకోవడం కోసం పెద్ద దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అందువల్ల చంద్రయాన్-2 ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ప్రయోజనాలున్నాయి. అంతరిక్షాన్ని ఆసరాగా చేసుకొని యుద్ధాన్ని ఎట్లా సాగించాలనే వ్యూహాలను రూపొందించడానికి డిఫెన్స్ స్పేస్ రిసెర్చి ఏజెన్సీ (డీఎస్ఆర్ఓ) ఏర్పాటుకు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఇటీవలే ఆమోదం తెలిపింది. త్రివిధ దళాలతో సమన్వయం చేసుకోవడానికి శాస్త్రవేత్తల బృందాన్ని ఏర్పాటుచేస్తున్నారు. అంతరిక్షయుద్ధానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడానికి కూడా భారత్ సిద్ధపడుతున్నదనేది మరో విశేషం. ప్రపంచంలోని పెద్ద దేశాలన్నీ అంతరిక్షాన్ని కూడా వేదికగా చేసుకుంటున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలను కాపాడుకోవడం, శత్రుదేశాల వ్యవస్థలను ధ్వంసం చేయడం, శత్రు దేశాలపై నిఘా వేయడం, ఉపగ్రహ వ్యవస్థల ఆధారంగా నియంత్రణలు, ఆదేశాలు సాగించడం తప్పనిసరైంది. అంతరిక్ష హంగుల ద్వారా శత్రు దేశానిది పైచేయి కాకుండా ఉండాలంటే, ఆ రంగంలో కూడా దీటుగా ఎదుగక తప్పదు. ఇటీవలే అంతరిక్షంలోని ఉపగ్రహాన్ని పేల్చివేసే ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించడం కూడా భారత్ అంతరిక్ష రక్షణ విధానంలో భాగమే.

## స్నేహపూరిత వాతావరణంలో లోక్ అదాలత్ ద్వారా

# పరిష్కారమైన కేసులలో ఇరుపార్టీలు విజేతలే

### చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.ఆర్.రాజీవ్



చోడవరం : స్నేహ పూర్వక వాతావరణంలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన కేసులలో ఇరుపార్టీలు విజేతలేనని చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.ఆర్.రాజీవ్ అన్నారు. పట్టణంలోని కోర్టుల సముదాయంలో శనివారం జాతీయలోక్ అదాలత్ కార్య క్రమంకు ముందుగా కక్షిదారులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలోను, మనస్పర్ధలు, కక్షపూరితంగా ఇలా వివిధ రకాలుగా కేసులు నమోదై కోర్టు మెట్లు ఎక్కడం జరుగుతుందన్నారు. అయితే సాక్ష్యాలు, వాదోపవాదాలు అనంతరం కక్షిదారులలో ఎవరో ఒకరు విజేతలుగా ఉంటే, మరో వర్గం పరాజితులుగా ఉంటారని, లోక్ అదాలత్‌ల ద్వారు ఇరుపార్టీలు రాజీ మార్గం అనుసరిస్తూ సామరస్య వాతావరణంలో కేసులు పరిష్కరించడం ద్వారా ఇరుపార్టీలు విజేతలుగా నిలచి వారి మధ్య స్నేహపూరితమైన మంచి వాతావరణం ఏర్పడుతుందన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనప్పటికి తమకు అన్యాయం జరిగినట్లైతే ప్రభుత్వ సంబంధిత ఉన్నతాధికారులు సమస్యను వివరించాలని, అధికారుల నుంచి స్పందన లేని పక్షంలో మండల న్యాయ సేవాధికార సంస్థకు అర్జీ రూపంలో తెలియచేస్తే సంబంధిత అధికారులకు నోటీసు జారీ చేసి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీ మార్గమే రాజీ మార్గమని, లోక్ అదాల త్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోతల ప్రకాష్‌రావు మాట్లాడుతూ జాతీయలోక్ అదాలత్‌లు సద్వినియోగం చేసుకోవడంలో చోడవరం కోర్టు రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. న్యాయమూర్తులు, న్యాయ వాదులు, పోలీసులు, కక్షిదారుల పూర్తి సహాయ సహ కారాలంతో కేసులు సత్వరం పరిష్కారమవు తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో న్యాయ వాదులు జి.లక్ష్మీనారాయణ, వి.వెంకటరావు, ఏ.జి.పి. అల్లు గిరిధర్, వివిధ ప్రాంతాలకు చెందిన కక్షి దారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ పథకంను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలి

### బీజేపీ యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి నగిశెట్టి గంగబాబు



మాకవరపాలెం : ఆయుష్మాన్ భారత్ పథకంను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని బిజెపి యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి నగిశెట్టి గంగబాబు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రాం పథకం ద్వారా దేశ ప్రజలకు ఎంతో ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. అటువంటి పథకంను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని కోరారు.

ఒక్కో కుటుంబానికి ప్రతీ సంవత్సరం రూ.5లక్షల ఆరోగ్య బీమా అందించా లన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్య మన్నారు. దేశంలో 10 కోట్లకు పైగా పేద కుటుంబాలకు ఆరోగ్య భీమా కల్పించేందుకు ఈ పథకం ప్రవేశ పెట్టారన్నారు. ఈ పథకం పేరు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య అభియాన్ పథకం అమలు బాధ్యతను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అప్పగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద 1,350 రకాల చికిత్సలకు ప్రభుత్వం ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా చేయించుకునే వీలుంటుందన్నారు.

నేషనల్ హెల్త్ ఏజెన్సీ(ఎన్‌హెచ్‌ఏ) అతి పెద్ద ఆరోగ్య బీమా పథకం మంచి పథకమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ప్రవేశ పెట్టాలన్నారు. గతంలో ఈ పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డుకున్నా రన్నారు. కావున రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి వైయస్.జగన్మో హనరెడ్డి చొరవ తీసుకొని వెంటనే రాష్ట్రంలో ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ

# గోవాడ షుగర్స్ కార్మికుల నిరసన



చోడవరం : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం నిరసన చేపట్టారు. షుగర్సు వర్కర్సు యూనియన్ నాయకులు కె.బాస్కరరావు ఆధ్వర్యంలో కార్మికులతో కలసి నిరసన చేపట్టారు. కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని, 2017-18, 2018-19 కార్మికుల ఇన్సెంటివ్ ఇవ్వాలని, లీవ్ సాలరీ, 5వ నెల ఓ.టి ఇవ్వాలని, అలాగే కార్మికుల టూర్ వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫ్యాక్టరీ ఎం.డి.కె.ఆర్.విక్టర్ రాజుకు సమస్యను వివరించారు. ఫ్యాక్టరీ ఆర్ధిక పరిస్థితి కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయని, త్వరలోనే కార్మికుల జీతాలు ఇచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఎం.డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ అధికారులు ఏ.వో చంద్రశేఖర్‌రెడ్డి, సి.డి.వో మల్లిఖార్జునరెడ్డి, సి.ఈ.రామ భద్రరాజు, ఫ్యాక్టరీ కార్మిక యూనియన్ నాయకులు అల్లం రామ అప్పారావు, నానిబాబు, ఏడువాక నారాయణ రావు, అల్లం వెంకటరమణ, బేరా నారాయణరావు, పండా కృష్ణ, అధికారి శ్రీరామమూర్తి , కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమికి సాయిబాబా ఆలయం ముస్తాబు

నాతవరం : ఈ నెల 16న జరగనున్న గురుపౌర్ణమికి నాతవరం షిర్డిసాయిబాబా ఆలయం ముస్తాబవుతుంది. 16న ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం భక్తులకు భారీ అన్న సమారాధాన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సాయిబాబా ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

## కవి సమయం

# గీతార్థం యిదిగో

- గీత ఒక కల్ప వృక్షము
- అది శ్రీ కృష్ణునిచే నాటబడినది
- వ్యాసునిచే పెంచబడినది
- ఉపనిషత్తులు దాని విత్తనములు
- జ్ఞాన ప్రభోదమే దాని అంకురం
- వివిధ శాస్త్ర రహస్యములు దాని కొమ్మలు
- విషయ విరక్తి, సహనము దాని చిగుళ్ళు
- పరమాత్మ యొక్క పద్మముల పాద పద్మముల యందు
- భక్తియే దాని పుష్ప సుగంధం
- మోక్షమే దాని ఫలం
- నీవు దేవునివైపు ఒక అడుగు వేసినచో
- దైవం నీ వైపు పది అడుగులు వేయును
- నీ కర్తవ్యం నీవు చిత్తశుద్ధితో చేసినచో
- దైవం నీవు పొందవలసిన ఫలితం కన్న ఎక్కువే యిచ్చును
- కొండ గృహంలోనికి వెళ్లి అది పలుకలేదే అని తలంపకుము
- నీవు ధ్వని చేయి - అది ప్రతధ్వని చేయును
- ధనముతో వస్తువులను కొనగలము
- కాని మనఃశాంతిని కొనలేము
- ప్రలోభాలకు లొంగని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

... కవితా రచన
శ్రీ స్వామి అప్పాజి భగవాన్
సెల్ నెం: 98486 44336

# 28న ఏపిసెట్ నోటిఫికేషన్ విడుదల

- ఆగష్టు 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ - అక్టోబర్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష
- వివరాలు వెల్లడించిన వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



విశాఖపట్నం : రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష(ఏపిసెట్) ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ ఈ నెల 28న విడుదల చేస్తున్నట్లు వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తెలిపారు. శనివారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగష్టు 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.సెప్టెంబర్ 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ 1000 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 19 వరకు, రూ 2 వేల అపరాధ రుసుముతో సెప్టెంబర్ 26 వరకు, రూ 5వేలు అపరాధా రుసుముతో అక్టోబర్ 3 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఏపి సెట్ ప్రవేశ పరీక్షను అక్టోబర్ 20వ తేదీన నిర్వహిస్తారు. ఏపిసెట్ ప్రవేశ పరీక్షను రాష్టంలో 6 ప్రాంతీయ కేంద్రాలలో నిర్వహిస్తారు. విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరుపతి కేంద్రాలలో జరుగుతాయి. మెత్తం 30 విభాగాలలో పరీక్షలునిర్వహిస్తారు. ఈ సంవత్సరం విజువల్ ఆర్ట్స్ విభాగంలో ప్రవేశ పరీక్ష ఏర్పాటు చేసామన్నారు. థియేట్ ఆర్ట్స్, సంగీతం, నృత్యం, ఫైన్ ఆర్ట్స్ విభాగాల వారు కూడా దరఖాస్తు చేయవచ్చునన్నారు. పరీక్ష రుసుముగా జనరల్ విభాగాల వారు రూ 1200, బిసిలు రూ 1000, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు రూ 700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్షకు నెగెటివ్ మార్కులు ఉండవన్నారు. మరిన్ని వివరాలకు www.andhrauniversity.edu.in, apset.net.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపిసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాస రావు, వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.భైరాగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబటి రాయుడి పట్ల పశ్చాత్తాపం అనవసరం

### దినేశ్ కార్తీక్‌కు కూడా చాలా అవకాశాలు ఇచ్చారు

ముంబయి: ప్రపంచకప్ ముందు నుంచి నాలుగో నంబర్ స్థానంపై ఆందోళన వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సెమీస్‌లో ఓడిపోయి టీమిండియా మెగా ఈవెంట్ నుంచి నిష్క్రమించింది. ఆ స్థానంలో అనేక మంది ఆటగాళ్లని పరీక్షించినా సరైన ఆటగాడిని తయారు చేయడంలో బీసీసీఐ విఫలమైందినే విమర్శలు వస్తున్నాయి. విజయ్‌శంకర్, మనీష్‌పాండే, సీనియర్ ఆటగాళ్లు దినేశ్ కార్తిక్, అంబటి రాయుడును నాలుగో స్థానంలో ఆడించినా ఆ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు.

# గ్రామీణ వైద్యులను ఆదుకోవాలి

### సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అదనపు కార్యదర్శి జంగం జోషి



విశాఖపట్నం : గామీణ వైద్యుల సంక్షేమ సంఘం అదనపు కార్యదర్శి జంగం జోషి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మారు మూల పల్లెలకు సైకిల్ వెల్లలేని ప్రాంతాల్లో వైద్య సేవలను అందిస్తున్నామని అయినప్పటికీ తమకు ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 వేల మంది గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తమ బాధలను గుర్తించిన అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి 2008 సంవత్సరంలో 429 జీఓను విడుదల చేయడం జరిగిందన్నారు. అయితే 2012లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి అర్ధాంతరంగా ఆర్ఎంపీ శిక్షణా తరగతులను అపుదల చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తన పాదయాత్రలో తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తెలుసుకున్నారని తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తమకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్టంలో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత తమకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్టంలో అనేక వర్గాలకు న్యాయం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు గోపాలరావు, లింగరాజు, బాల శంకరం, గణేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సహకార సంస్థలకు మరింత ప్రోత్సాహం అందించాలి



విశాఖపట్నం : సహకార సంస్థలను మరింత బలోపేతం చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సహం అందించాలని ద ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు కోరారు. ద్వారాకానగర్లో శని వారం 17వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కల్పించిన రైతు భరోసా ఎంతో ఆనందాయకమన్నారు. ఈ పథకం ప్రతి చిన్న, సన్నకారు రైతులకు ఆసరాగా నిలుస్తుందని వెల్లడించారు. తమశాఖ ద్వారా ప్రతి అరుడికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు చేరవేస్తా మన్నారు. నూతన వచ్చిన ప్రభుత్వం చేస్తున్న ప్రతిష్టాత్మకమైన సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎదైతే రైతులకు శాతం రుణాలు అందిస్తున్నాయో వాటి విధివిధానాలును విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం సహకార సంస్థలను నిర్వీర్యం చేశాయని వెల్లడించారు. నూతనంగా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సహకార సంస్థలకు మరింత ప్రోత్సహం అందిస్తే మరిన్ని విజయాలు సాధించడానికి ఆవశ్యకత వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కె. భావన రుషి, వైవి. కోటేశ్వర రావు, అధ్యక్షుడు ఆర్ జానికి రావు, వివి. శారదారావు, వివివి. సత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వింబుల్డన్ విజేతగా హలెప్

లండన్: వింబుల్డన్ మహిళా సింగిల్స్ ఫైనల్లో సెరెనా విలియమ్స్‌ను చిత్తుగా ఓడించిన సిమోనా హలెప్ తొలి వింబుల్డన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఏకపక్షంగా సాగిన మహిళ సింగిల్స్ తుదిపోరులో సెరెనాను హలెప్ 6-2, 6-1 తేడాతో ఓడించింది. దీంతో వింబుల్డన్ టైటిల్‌ను గెలిచిన తొలి రొమేనియన్‌గా ఆమె రికార్డు సృష్టించింది. తన కెరీర్‌లో ఇది రెండో గ్రాండ్‌స్లామ్ అవ్వడం విశేషం. 2018 ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆమె తొలి టైటిల్‌ను అందుకుంది. ఫైనల్లో హలెప్‌ను ఓడించి మార్గరేట్ కోర్ట్ (24) పేరిట ఉన్న ఆల్‌టైమ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డును సమం చేయాలనకున్న అమెరికా తార సెరెనా ఆశలు ఆవిరయ్యాయి. సెరెనా ఫైనల్లో తడబడటం ఇది మూడోసారి. గత ఏడాది వింబుల్డన్ ఫైనల్లో, యుఎస్ ఓపెన్‌లోనూ సెరెనా ఓడింది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## వనం..మనంలో వయోశ్రేష్టులు

విజయనగరం : జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన "వనం మనం" కార్యక్రమంలో వయో శ్రేష్టులు భాగస్వామ్యులు అయినట్లుగా జిల్లా వయో శ్రేష్టుల సంక్షేమ సంఘం కార్యదర్శి జి. పైడితల్లి తెలిపారు. జిల్లా పోలీసుశాఖ ఇచ్చిన పిలుపు మేరకు పోలీసు పరేడ్ గ్రౌండులో నిర్వహించిన "వనం..మనం" కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను ప్రతీ ఒక్కరూ నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యతలను చేపట్టా లన్నారు. పోలీసు ఉద్యోగులతో సహా పోలీసు పరేడ్ గ్రౌండులో మొక్కలను నాటారు.

# పోటెత్తిన అమ్మవారి భక్తులు



పెద్దాపురం : పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా ఈనెల 3వతేదీ నుండి అమ్మవారి దర్శనానికి రాష్ట్రం వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో రావడం జరుగుచున్నది. శనివారం కూడా విశేషంగా భక్తులు రావడంతో దేవాలయం ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. క్యూలైన్లు భక్తులతో నిండిపోయినవి. భక్తులకు తాగునీరు, మజ్జిగ, స్వచ్ఛంద సంస్థలు, దేవాలయం అధికారులు ఏర్పాటు చేశారు.

సకాలంలో అమ్మవారి దర్శనం భక్తులకు లంభించే విధంగా వాలంటీర్లు సహకరిస్తూ, దేవాలయంలోనికి వెళ్ళే విధంగా సహకరిస్తున్నారు. తోపులాటలు, తొక్కిస లాటలకు చోటు లేకుండా పోలీసు చర్యలు తీసుకున్నారు. దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువులతో గల షాపుల వద్ద నిఘా ఏర్పాటు చేశ్యారు. దేవాలయం సిబ్బంది, అధికారుల అప్రమత్తంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు సహకరించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# హాస్టల్ విద్యార్థుల సమస్యలపై స్పందించిన ఆర్డీవో

అనకాపల్లి : పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం హాస్టల్ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై అనకాపల్లి ఆర్డీవో స్పందించారు. గవరపాలెం నూకాంబిక ఆర్చ్ వద్ద ఉన్న హాస్టల్ భవనాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులు పడుతున్న అవస్థలను గుర్తించారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భవనాన్ని మరో చోటికి తరలించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. అలాగే బకాయిలు ఇతర రాయితీలు విద్యార్థులకు అందేలా తగిన చర్యలు చేపడతానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత సంగీత శిక్షణా శిబిరం



విశాఖపట్నం : స్థానిక విమలకృష్ణ సంగీత అకాడమీ అధ్యక్షులు డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యంలో 13, 14 తేదీలలో భక్తి సంగీతం, లలిత సంగీతములపై ఒక ఉచిత సంగీత శిక్షణా శిబిరం నిర్వహింపబడుతున్నది. మొదటిరోజు కార్యక్రమంగా 13న వినాయక స్తుతి, తూము నరసింహ దాసు కీర్తన, డా.బోయి భీమన్న రచించిన ఒక ప్రబోధాత్మక లలిత గీతం నేర్పటం జరిగింది.

ఎస్.చంద్రామణి, డా.శారద నేటి అధ్యాపకులు కాగా, 14న ప్రసిద్ధ లలిత సంగీత దర్శకులు, కళాప్రవీణ బండారు చిట్టిబాబు లలిత గీతములను నేర్పనున్నారు. ఆసక్తి కలవారు అనేకమంది వచ్చి ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరం స్థానిక ఎంవీపీ కాలనీలోని పార్కు ఎదురుగా గల పతంజలి యోగా కేంద్రంలో నిర్వహింపబడుతున్నది.

# సబ్బవరం ఎక్సైజ్ సిఐగా ఎన్.శ్రీనువాసరావు



సబ్బవరం : సబ్బవరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.శ్రీనువాసరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఇక్కడ పనిచేసిన సిఐ బి.నర్శింహమూర్తి శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. నూతన సిఐ శ్రీనువాసరావు గతంలో శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ, కోటబొమ్మాళి, ఎచ్చెర్ల మండలాల్లో పనిచేసారు. విజయనగరం జిల్లాలోచింతపల్లిలో సుమారు 3 సంవత్సరాలు పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారని తెలిపారు.

ఈ సందర్భంగా సిఐ శ్రీనువాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మద్యం విధానంలో సమర్థవంతంగా పనిచేస్తానని,బెల్టుషాపులు నిర్మూ లనపై గట్టి నిఘా ఏర్పాటు చేసి దోషులను పట్టుకోవడంలో చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు.స్థానిక ఎక్సైజ్ఎస్సైగా కె.రాజారావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్సై రొంగలి. శ్యామలను పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెఎంఐఎమ్ఎల్ పాయింట్ ఎక్సైజ్ ఎస్సైగా బదిలీ చేశారని సిఐ శ్రీనువాసరావు తెలిపారు.

## 16న గొటివాడ శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి మహోత్సవం



సబ్బవరం : మండలంలోని గొటివాడ గ్రామంలోని శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలో ఈ నెల 16న గురుపౌర్ణమి మహోత్సవంలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయం ధర్మకర్త జనపరెడ్డి విభీషణరావు, దేవి దంపతులు ఒక ప్రకటనలో విలేకర్లకు శనివారం తెలిపారు. 15వ తేదీ సోమవారం ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు బాబా వారికి పంచామృత అభిషేకములు నిర్వహించబడును. అలాగే 10 గంటలకు సాయిదత్త హెూమం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి ఇచ్చి ప్రసాద వితరణ చేస్తారని తెలిపారు. చావడి ఉత్సవం జరుగును.

16వ తేదీ మంగళవారం ఆశాఢ శుద్ధ పాఢ్యమి ఉదయం5.30 ని,,లకు కాకాడ హారతి, సుప్రభాత సేవ మరియు 8 గంటలకు సహస్ర పుష్పార్చన, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించబడునని మధ్యాహ్నం12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగునని తెలియజేశారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా భక్తులందరూ పాల్గొని బాబా కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ వారు కోరారు.

## ఈఎన్ఎస్ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

# ఎంపీ చేతులు మీదుగా ప్రారంభం

విశాఖపట్నం: ఈస్టన్ నావల్ కమాండ్ పరిధిలోని ఇఎన్ఎస్ వైఎస్సార్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం గౌరవనీయులు విశాఖ పార్లమెంటు సభ్యులు మరియు యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎంవివి.సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కమాండ్ పరిధిలోని ఎన్‌డివి, ఎంఓవి మరియు ఇతర యూనిట్లలోని ప్రతీ కార్మికులు, ఉద్యోగస్తులు యూనియన్ సభ్యత్వం నమోదు చేసుకోవలసిందిగా కోరారు. కమాండ్ పరిధిలోని మెడికల్ ఇష్యూస్, ప్రామోషన్స్ మరియు ఎక్స్-అపార్యుటినిటీస్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వి.విజయప్రకాష్ మరియు యూనియన్ ఆఫీస్ బీరెర్స్ పాల్గొన్నారు.



## త్వరితగతిన కలెక్టర్ కార్యాలయ పనులు పూర్తి : ఆర్అండ్‌బి మంత్రి



శ్రీకాకుళం : జిల్లా పరిపాలనా భవనం (జిల్లా కలెక్టర్ కార్యాలయం) త్వరితగతిన పూర్తి చేయుటకు అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ చెప్పారు. జిల్లా పరిపాలనా భవనం నిర్మాణ పనులను శనివారం మంత్రి పరిశీలించారు. డా. వై.ఎస్.రాజశేఖర రెడ్డి మంత్రిమండలిలో ధర్మాన ప్రసాద రావు రాష్ట్ర రెవిన్యూ మంత్రిగా ఉన్నప్పుడు అత్యాధునిక జిల్లా కలెక్టర్ కార్యాలయం నిర్మాణం చేపట్టుటకు పనులను మంజూరు చేసారని మంత్రి అన్నారు. రూ.116 కోట్లతో భవనానికి పరిపాలనా పరమైన ఆమోదం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో రూ.74.50 కోట్లతో ప్రాథమికంగా నిర్మాణం చేపట్టుటకు నిధులు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఇప్పటి వరకు 40 శాతం మేర భవన భౌతిక నిర్మాణాలు పూర్తి అయ్యాయని మంత్రి వివరించారు. జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా దీనిని చేపడుతున్నామని కృష్ణదాస్ చెప్పారు. భవన నిర్మాణ పనులకు కాంట్రాక్టర్ బాగనే చేస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేసారు. రూ.18 కోట్ల పెండింగు బిల్లులను చెల్లిస్తామని అన్నారు. ఈ ప్రాజెక్టును దశలవారీగా నాణ్యతా ప్రమాణాలలో ఎటువంటి లోపం లేకుండా త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అత్యంత ముందుచూపుతో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళుటకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర అనుభవంతో పరిపాలన సాగుతోందని అన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో మేనిఫెస్టోలో పేర్కొన్న నవరత్నాలను 80 శాతం మేర అందించుటకు నిధులు కేటాయించారని మంత్రి కృష్ణదాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలను ప్రజలకు చేరువ చేయుటకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీరు కె.కాంతిమతి, ఉపకార్యనిర్వాహక ఇంజనీరు గణపతి., స్థానిక నాయకులు అంధవరపు వరం, ఎం.వి.పద్మావతి, శిమ్మారాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ కార్మికులే నిజమైన సంఘ సేవకులు : జైలు సూపరింటెండెట్ రాహుల్



విశాఖపట్నం : రాత్రనక పగలనక నిరంతరం విశాఖ నగర పరిసరాలను శుభ్రపరచుతున్న జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులే నిజమైన హీరోలుగా విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెట్ రాహుల్ అన్నారు. శనివారం నాడు ఆయన స్కిల్ డెవలప్ మెంట్ ఇన్సిట్యూట్ ను సందర్శించి అక్కడ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ వారిద్వారా జులై 1 నుండి 15 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికులు తమ స్వంత ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని, పని గంటల తర్వాత కొందరు తాగుడు, గుట్కా వంటి అనారోగ్య్య వ్యసనాలకు బానిసై జీవితాలను, కుటుంబాలను ఇక్కట్ల పాలు చేసుకుంటు న్నారని ఆవేదన వ్యక్త పరిచారు. హిందుస్థాన్ పెట్రోలియం చేస్తున్న స్వచ్ఛతా అవగాహనా కార్యక్రమాలను సంస్థ సీ.ఈ.ఓ కే.నగేష్ వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న 200 మంది పారిశుద్ధ్య కార్మికులను రాహుల్ శాలువాలతో సత్కరించి స్వచ్ఛతా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహ దాసు, అధికారులు మహేష్, శ్రీనివాస్, కిరణ్ సహా వివిధ వార్డుల శానిటరీ ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

## గృహ అవసరాలను తీర్చే

## గోబడ్డి మొబైల్ యాప్ సేవలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్

విశాఖపట్నం : గృహ నిర్వహణ అవసరాలను సులభంగా తీర్చేందుకు నూతనంగా రూపందించిన గోబడ్డి మొబైల్ యాప్ సేవలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. సంస్థ సీఇఓ దీపక్ ఈదిబిల్లి వినూత్న ఆలోచనతొ రూపొందించిన ఈ కొత్త యప్ సేవలను జిల్లా కలక్టర్ వి.వినయ్ చంద్ తన చాంబర్‌లో లాంఛనంగా ప్రారం భించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల జీవన విధానాన్ని మెరుగు పరచడంలో ఈ యాప్ ఉపయోగ పడుతుంది అని వ్యక్తం చేశారు. ఇంటి నిర్వాహణకు సంబందించిన అన్ని రకాలా అవసరాలకు ఈ యాప్ ను డౌన్లోడ్ చెసుకొని సహాయం పొందొచ్చు అన్నారు. ఇంటి మరమ్మత్తులు తొ పాటు ప్లంబింగ్, సానిటరి, హౌసెకీపింగ్, కార్ సంబదిత, ఎలక్ట్రికల్ మరియు ఇతర సేవలను ఈ యాప్ సహాయంతో త్వరలో పొందవచ్చును. గోబడ్డి ఇంటి సేవలకు సహాయం కొరుకునే కస్టమర్లను వారి చుట్టూ ఉన్న స్థానిక విశ్వసనీయ ప్రొవైడర్లతో కలుపుతుంది మరియు వారి మధ్య ఉన్న అన్ని లావాదేవీలను కొన్ని సాధారణ క్లిక్‌లలో చక్కగా వ్యవస్థీ కృత నమ్మదగిన పద్ధతిలో, ఒకే ప్లాట్‌ఫామ్‌లో చూసుకుంటుంది. ఈ కార్యక్రమంలొ దీపక్ ఈదిబిల్లి గొబడ్డి టీం పాల్గొన్నారు.



# పద్మవ్యూహంలో పెద్దాపురం ప్రజలు



పెద్దాపురం : పెద్దాపురం పట్టణంలో ప్రజలు తమ నిత్య కృత్యాలు కొరకు సమకూర్చుకొనడంలో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. దిన చర్యలలో భాగంగా మెయిన్‌రోడ్డులో గల వ్యాపార సంస్థలకు రావాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. దీనికి మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌కు నిబంధనలు వర్తించకపోవడం, ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం, ప్రతి వాహనం మీద

### దడ పుట్టిస్తున్న దర్గా

కనీసం ముగ్గురు ప్రయాణించడం, మెయిన్‌రోడ్డు మీద వాహనం కూర్చొని సెల్‌ఫోన్‌లలో సంభాషించడం, దారి ఇమ్మని అడిగితే, వారిపై తిరగబడడం, దీంతో ఎవ్వరూ ఏ విషయం పట్టించుకోకపోవడంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారు. పట్టణంలో ప్రదానంగా మెయిన్‌రోడ్డు, దర్గాసెంటర్లు ప్రధానమైన కూడళ్లు, మెయిన్‌రోడ్డు వ్యాపార సంస్థలకు కూడలి అయితే, దర్గా సెంటర్లు పట్టణం చుట్టూ పక్కల గల పలు గ్రామాలకు రాకపోకలకు కూడలి కావడంతో ఈ ప్రవేశాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయంలలో ఇరుక్కున్న ప్రజలకు క్షేమంగా బయట పడడం ఒక వరంగా మారందని అంటున్నారు. ఈ సమయాలలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకొని, ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నైతికవిలువలకు భగవద్గీతే మూలం

విజయనగరం : మనిషిలో నైతిక విలువలు పునర్జీవం పోసుకునేందుకు.. ప్రేరణ కల్గించేది భగవద్గీత అని వికాస తరంగిణి కన్వీనర్ తల్లా ప్రగడ అరుణ అన్నారు. స్థానిక బాలాజీనగర్‌లో తొలిఏకాదశి సందర్భంగా బాలాజీ వాకర్స్ సభ్యులు 210మంది భగ వద్గీతలో 9,12 అధ్యాయాల్లో శ్లోకాలు నేర్చుకున్నారు.

చాతుర్మాస ప్రయుక్త శ్రీమద్భగ వద్గీతాజ్ఞాన యజ్ఞం నిర్వహిస్తూ ప్రతిరోజూ శ్లోకాల పఠనం లో శిక్షణ ఇస్తున్నారు.

# ఏపీలో ఇక సర్కారీ మద్యం దుకాణాలు.. ఒక్కో షాపులో నలుగురికి జాబ్స్

- అక్టోబరు నుంచి దుకాణాలు ప్రారంభించే యోచన
- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధే లక్ష్యం
- కొత్త మద్యం పాలసీలో ప్రకటించనున్న ప్రభుత్వం

అమరావతి : కొత్త మద్యం పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం విస్తృత కసరత్తు చేస్తోంది. ఇందుకుగాను పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ప్రభుత్వమే సొంతంగా మద్యం షాపులు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికిగాను ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబరు నుంచి కొత్త విధానం ప్రవేశపెట్టడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. వాస్తవానికి జూన్ నెలాఖరుతో మద్యం షాపుల గడువు ముగిసింది. కానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరడం..మద్యం పాలసీ రూపొందించడంలో జాప్యంతో మద్యం షాపులకు మరో మూడు నెలలు గడువు పెంచారు. అయితే షాపుల సంఖ్యను కుదించారు. ప్రస్తుతం నూతన మద్యం విధానం తయారుచేయడంలో సంబంధిత శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

సంస్కరణలతో ముందుకు.. : మద్యం పాలసీ విధానంలో సరికొత్త సంస్కరణలు తీసుకురావడం ద్వారా దశలవారీగా మద్యం నిషేధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఏటా 25 శాతం మద్యం దుకాణాలు తగ్గించాలని నిర్ణయించింది. మూడు నెలల పాటు షాపుల నిర్వహణ గడువు పెంచినా...వాటి సంఖ్య మాత్రం ఇప్పటికే తగ్గించారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే మద్యం విక్రయాలను నిలిపివేయాలని కూడా నిర్ణయించింది. దీనిపై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా కొత్త కొత్త ఆంక్షలు, నిబంధనలు విధించడం ద్వారా మద్యం నిషేధం వైపు ప్రభుత్వం అడుగులేస్తోంది.

ఒక్కో మద్యం షాపులో ముగ్గురు సేల్స్ మెన్లు, ఒక సూపర్ వైజర్‌ను నియమించాలని ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనలు పంపించింది. మద్యం షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేసే వ్యక్తి నుంచి డిపాజిట్ సేకరించనున్నారు. షాపు ఆర్థిక లావాదేవీలన్నింటికీ సూపర్‌వైజర్‌నే బాధ్యుడుగా చేయనున్నారు.

ఇలా నియమించిన సిబ్బంది జీత భత్యాలు, ఇతర్రతా అలవెన్సుల విషయంపై ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. కొద్దిరోజుల్లో దీనిపై స్పష్టత రానుంది.

తమిళనాడు తరహాలో.. : ప్రభుత్వ మద్యం దుకాణాలు పొరుగు రాష్ట్రం తమిళనాడులో ఉన్నాయి. అక్కడి విధానమే మన రాష్ట్రంలో అమలు చేయాలన్నది ప్రభుత్వ భావన. ఈ విధానం అక్టోబరు 1 నుంచి అమలు చేయడానికి యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జనాభా ప్రాతిపదికన షాపులను ఏర్పాటు చేస్తారు. షాపుల్లో ప్రభుత్వమే సిబ్బందిని నియమిస్తోంది. ప్రతి రోజు జరుగుతున్న విక్రయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దుకాణానికి వచ్చిన నిల్వ, విక్రయాలలో తేడా ఉంటే పనిచేసే సిబ్బందిపై కఠినచర్యలకు ఉపక్రమించనున్నారు. తద్వారా బెల్టు షాపులు, లూజు విక్రయాలు తగ్గుముఖం పట్టనున్నాయి. ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించడం వల్ల ఎక్సై.జ్, అబ్కారీ శాఖపై అదనపు భారం పడనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# హరిత ఉద్యమంలో భాగస్వాములు కండి

## కార్పొరేషన్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ



విజయనగరం : భవష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించాలనే సంకల్పంతో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ పిలుపునిచ్చారు. నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతుందన్నారు. శనివారం స్థానిక కాటవీధి పార్కులో కార్పొరేషన్, అటవీశాఖ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు రావాలన్నా.. వాతావరణం చల్లబడాలన్నా.. ఉష్ణోగ్రతలు నియంత్రించాలన్నా మొక్కల నాటడం ద్వారానే సాధ్యమవుతాయన్నారు. పుట్టినప్పుడు ఊయల కావాలి.. దాన్ని తయారు చేయాలన్నా చెట్టే కావాలని, మరణిం చినప్పుడు కాల్చడానికి చెట్టు కట్టే కావాలని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, నాటిన మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా భావించకుండా స్వంత ఇంటి కార్యక్రమంగా భావించాలన్నారు. సోషల్ ఫారెస్టు అధికారి బి.జానకీరామ్ మాట్లాడుతూ మొక్కలు నాటడాన్ని ప్రతీ పౌరుడు తన సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. మొక్కలు నాటడం వలన కలిగే లాభాలను వివరించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి ప్రగతికి మెట్లు వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నగరంలో కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు నాటడమే శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువులు కాపాడుకుందాం : ఆర్.డి.ఓ : జె.వి.మురళి



విజయనగరం : భావితరాల భవిష్యత్, పర్యావరణ పరిరక్షణ, ప్టణం సుందరరంగా తీర్చిదిద్దడం, చెరువులు శుద్ధిచేసి భూగర్భజలాలలను కాపాడటం మహాసంకల్పమని రెవిన్యూ అధికారి డివిజల్ జె.వి.మురళీ అన్నారు. శనివారం పూల్‌భాగ్‌లో దుర్గంధభరితంగా,ప్లాస్టిక్ సంచులతో, వ్యర్థ్యాలతో నిండిన రెండు ఎకరాల్లో విస్తరించిన చెరువును శుద్ధిచేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

డివిజన్‌లోని 19 మంది తహసిల్దార్లు, ఉప తహసిల్దార్లు, సిబ్బంది, కలక్టరేట్ సిబ్బంది నగరపాలకసంస్థ సిబ్బంది, అధికారులు, మున్సిల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం యజ్ఞంలా కొనసాగింది. ఒక్కసారి 200 మంది సిబ్బంది చేపట్టిన పనుల వల్ల గతంలో మంచినీటిగా ఉండి నిరుపయోగమైన చెరువు పూర్వ వైభవాన్ని పొందింది. నీటి వనరులను కాపాడటం వల్ల నగరానికి మంచి ఫలితాలు పొంద వచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అప్పన్నను దర్శించుకున్న వివిధ ప్రముఖులు




సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామివారిని శనివారం నాడు విశాఖ జిల్లా కలెక్టర్ వినయచంద్ ఐ ఏ ఎస్ మరియు టూరిజం శాఖా మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ మొదలుగువారు కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు . సింహగిరికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా .బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలిం గనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేసారు . అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ అధికారులు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.




# ప్లాస్టిక్ సంచుల విక్రయంపై ఆకస్మిక తనిఖీలు



విజయనగరం : విజయనగరం పట్టణంలోని మార్కెట్ ఏరియా, గంటస్తంభం, కోట ప్రాంతాల్లో ఉన్న పలు వ్యాపార సంస్థలపై కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు స్వాధీనం చేసు కున్నారు. వ్యాపార సంస్థలకు జరీమానా విధించారు. ఈ సందర్భంగా కార్పొ రేషన్ పర్యావరణ ఇంజనీర్ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పుగా వాటిల్లిన ప్లాస్టిక్‌ను నిషేదించాలని ఎన్నివిధాలుగా ప్రచారం చేసినా ఇంకా పలువురు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లును అమ్ముతూనే ఉన్నారన్నారు. ఇకపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు.

# మరోజన్మ ఉంటే గిరిజనుడిగా పుడతాను

- బాక్సైట్ తవ్వకాలు జరగవు - గిరిజన హక్కులు పరిరక్షణ
- ఎకోటూరిజం అభివృద్ధి - పాడేరు డివిజన్‌లో గిరిజన యూనివర్సిటీ
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్





పాడేరు : రైతులకు సకాలంలో విత్తనాలు సర ఫరా చేస్తామని,రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మరోజన్మంటు ఉంటే గిరిజనుడిగా పుడతానన్నారు. శనివారం ఐటిడి ఏ సమావేశ మందిరంలో ఏజెన్సీలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. గిరిజన హక్కుల పరిరక్షిస్తామని, మన్యంలో బాక్సైట్ తవ్వకాలు జరగవన్నారు. గిరిపుత్రుల జీవన విధానానికి ఆటంకం కలిగించమని చెప్పారు. వచ్చే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాటికి జి. ఓ. జారీ చేయడానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు 25 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి నిర్ణయం తీసుకుందన్నారు. ఇంటి స్థలాలు పేదలకు అందించడానికి ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని సూచించారు. కొండ శిఖర గ్రామాలను తరలించి ప్రతి మండలంలో ఒక మోడల్ కాలనీ నిర్మించాలని సూచించారు.

ఏజెన్సీలో గిరిజనులు గంజాయి సాగు చేయకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రాము వాలంటీర్ల నియామకాలు పారదర్శకంగా చేయాలన్నారు. అమ్మవడి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు.

వివిద శాఖ పనితీరుపై సమీక్ష ఏజెన్సీలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాఖల వారీగా సమీక్షించారు. గిరిజన సహకార సంస్థ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, రహదారులు భవనాలుశాఖ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, విద్యా విభాగాల పై మంత్రి సమీక్షించారు. గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న గిరిజన ఉత్పత్తులు, మద్దతు ధరలపై సమీక్షించారు. ఇంజనీరింగ్ శాఖ మంజూరు చేసిన పనులు, వాటి ప్రగతిపై ఆరా తీసారు. చింతపండు, కాఫీ ఉత్పత్తులపై ప్రశించారు. ఎన్ని రకాల గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర అందిస్తున్నారని జిసిసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ఉత్పత్తులను జిసిసి ద్వారా కొనుగోలు చేసి గిరిజన రైతులను దళారుల నుండి రక్షణ కల్పించాలని చెప్పారు. అల్లూరి సీతారామరాజు గిరిజన మ్యూజియం పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి తీవ్రతను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళతానన్నారు. సికిల్ సెల్ ఎనిమియాతో బాధపడేవారికి , సామాజిక పింఛన్లు మంజూరు చేయించడానికి కృషి చేస్తామన్నారు. దళిత మహిళకు హోంశాఖ మంత్రి పదవి, గిరిజన మహిళలకు ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ మంత్రి పదవి ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. అరకు పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి మాట్లాడతూ కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టడానికి కృషి చేస్తానన్నారు. పార్లమెంటు సమావేశాలు పూర్తయ్యాక నియోజక వర్గం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్య, వైద్యరంగాలపై దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు లేని పాఠశాలల, తాగునీటి సదుపాయాలు లేని గ్రామాలుచాలా ఉన్నాయన్నారు. జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని చెప్పారు. ఖాళీను భర్తీ చేయాలని కోరారు. ట్రైబల్ సబ్ ప్లాన్ కింద ప్రభుత్వం 4988 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.85 కోట్లు ఏజెన్సీకి రావాల్సి ఉందన్నారు.

అరకు శాసన సభ్యులు చెట్టి పాలుణ మాట్లాడుతూ ఏజెన్సీలో ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఏజెన్సీలో సికిల్ సెల్ ఎనిమియాతో బాధపడేవారికి ముఖ్యమంత్రితో మాట్లాడి, రూ.10 వేలు పింఛను అందించాలని మంత్రిని కోరారు.రహదారులు, తాగునీటి సదుపాయాలు, రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు.




## కృష్ణం నాయుడుకు గీతం పిహెచ్‌డి అవార్డు



విశాఖపట్నం: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో జరిపిన పరిశోధనలకు గాను ఆర్.ఎస్.ఆర్. కృష్ణం నాయుడుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పిహెచ్‌డి అవార్డును ప్రకటించింది. డాక్టర్ యు.సల్మా పర్యవేక్షణలో తన పరిశోధనలు పూర్తి చేసిన ఆర్.ఎస్.ఆర్.కృష్ణం నాయుడు పరిశ్రమల అవసరాలకు ఉపయోగపడేలా మోటర్ల చోదక శక్తిని పెంచడంలో తన పరిశోధనా ఫలితాలు ఉన్నాయని తెలిపారు.ఈ ఉపకరణాలు ఎక్కువగా ఎయిరోస్పేస్, మెడికల్ హర్ట్ బ్లడ్ పంపింగ్ అప్లికేషన్స్ లో ఉపయోగపడతాయని తెలిపారు. రోటార్, వైండింగ్ వంటివి లేని సందర్భంలో కూడా మోటార్లను అవసరానికి తగిన విధంగా ఎలా ఉపయోగించవచ్చో తన పరిశోధనలో వెల్లడించినట్లు డాక్టర్ ఆర్.ఎస్.ఆర్. కృష్ణం నాయుడు తెలిపారు.

## అప్పన్న అన్నప్రసాదానికి లక్ష విరాళం



సింహాచలం :శ్రీ వరాహలక్ష్మీనారసింహస్వామి వారికి ప్రాంతానికి అనకాపల్లి ప్రాంతానికి చెందిన పి సత్యనారాయణ గారు 1 లక్ష 1వేయి 116 రూపాయలను స్వామివారి అన్నప్రసాదానికి అందజేశారు .ఈ చెక్ ను అప్పన్నధర్శనం.అనంతరం కుటుంబసమేతంగా ఆలయ ఏ ఈ ఓ పులిరాము రాజేంద్ర గారికి అందజేయటం జరిగింది.

## ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకారసేవ



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం శ్రీ స్వామివారి ప్రాకారసేవ అత్యంత ఘనంగా జరిగింది.ఉదయం 8 గం.లకు స్వామి,అమ్మవార్లను పల్లకిలో ఉంచి స్వామివారి ఆలయం ప్రధాన రాజగోపురం చుట్టూ భక్తుల గోవిందనామాల మధ్య ముమ్మారు ప్రదక్షిణ గావించారు.ఈ కార్యక్రమంలో ఈవో ఎంవి.సురేష్ బాబు,ఏసి ఈరంకి.జగన్నాధరావు,చైర్మెన్ ఐవి.రోహిత్ మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పంచాయతీ విస్తరణాధికారిగా ప్రభాకర్



గొలుగొండ: గొలుగొండ మండలం కొత్త ఇఒపిఆర్‌డిగా శనివారం ఎస్.ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. ప్రభాకర్ గతంలో కోటవురట్ల ఇఒపిఆర్‌డిగా పని చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇఒపిఆర్‌డిగా సేవలందించిన త్రిమూర్తులు బదిలీపై ఎస్. రాయవరం మండలం వెళ్లడం జరిగింది.

## అవంతీ ప్రాంగణ జాబ్ మేళా ఎంపికలు



భీమునిపట్నం: తగరపువలస లో ఉన్న అవంతీ ఇజినీరింగ్ కళాశాలలో శనివారం 2018 -2019 విద్యా సంవత్సరం లో బి.టేక్, ఎం.టెక్, బి ఫారం, ఎం బి ఎ పూర్తి చేసిన అవంతీ విద్యాసంస్థల విద్యార్దులకు మరియు ఇతర విద్యాసంస్థల విద్యార్దులకు దీనిలో సుమారు ఎనిమిది కంపినీల హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొని ప్రాంగణ ఎంపికలు సుమారు ఐదు వందల మంది అభ్యర్ధులు పాల్గొన్నారు. దీనిలో ఏబై ఐదు గురు ఎంపిక చేసామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ఎన్ వి గణేష్ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో అవంతీ విద్యసంస్థల జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం ప్రియాంకఅన్నారు.ఈ కార్యక్రమం లో మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్ , వైస్ ప్రేసిడేంట్ ఎం.నంధీష్,డైరెక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు

# గీతం వైస్ ఛాన్స్‌లర్‌కు పూర్వ విద్యార్థుల సన్మానం



విశాఖపట్నం: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్స్‌లర్‌గా ఇటీవల బాద్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కె.శివరామకృష్ణను పూర్వవిద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్భాగంగా ఉన్న గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఫాకల్టీ సభ్యుడిగా ప్రవేశించిన ప్రొఫెసర్ కె.శివరామ కృష్ణ ఇనిస్టిట్యూట్ డీన్‌గా, ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలు అందించి ఎందరికో మార్గదర్శకుడిగా మారారని పూర్వవిద్యార్థులు కొనియాడారు. ఎంతో దూరదృష్టి, జాతీయ స్థాయిలో పలు కమిటీలలో పనిచేసిన అనుభవం, గీతంలో గల దీర్ఘ కాలిక అనుబంధంతో ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ గీతం విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్ళగలరని కార్యక్రమంలో పాల్గొన్న గీతం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు ఆకాంక్షించారు.గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, భారత పరిశ్రమల సమాఖ్య విశాఖ ఛైర్మన్ కె.వి.వి.రాజు, శ్రావణ్ షిప్పింగ్ మేనేజింగ్ డైరక్టర్ జి.సాంబ శివరావు,గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గౌతమ్ రావు తమ ప్రసంగాలలో గీతం వైస్ ఛాన్స్‌లర్ గా ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ ఎంపిక విశ్వవిద్యాలయం ప్రగతికి దోహదపడగలదన్నారు.

ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ మాట్లాడుతూ స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి తనకు ఆదర్శమని,ఆయన మార్గదర్శకంలో ఎన్నో విషయాలను నేర్చుకున్నానని తెలిపారు. గీతం ప్రగతిలో అద్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందితో పాటు పూర్వ విద్యార్థుల సహకారం అవసరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రాంకింగ్‌లలో అగ్రస్థానంలో నిలవాలంటే అంకితభావంతో అందరూ కృషి చేయాలన్నారు. గీతం ప్రస్తుత అద్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మంచి దార్మినికుడు అని, ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడానికి నిరంతరం తపించేవ్యక్తి అని అన్నారు. పూర్వవిద్యార్థుల సన్మానం ద్వారా తనపై మరింత గురుతర బాద్యతను పెంచారని పేర్కోన్నారు. పూర్వవిద్యార్థులు మరియు కార్యక్రమ కో-ఆర్డినేటర్ శ్రీమతి వై.గీత, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, వివిధ సంస్థలలో ఉన్నత స్థానంలో విధులు నిర్వహిస్తున్న పూర్వవిద్యార్థులు హజరై ప్రొఫెసర్ కె.శివరామకృష్ణను సన్మానించారు.

## ప్రేమ సమాజం బాలబాలికలకు వస్త్రాలందజేత

విశాఖపట్నం: డాబాగార్డెన్స్ ప్రేమసమాజం ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు, బాలబాలికలకు 'ది ఎమ్మిగనూరు వీవర్స్ కో-ఆపరేటివ్ ప్రొడక్షన్ అండ్ సేల్ సొసైటీ లిమిటెడ్ ప్రతినిధులు విశాఖ వాస్తవ్యులు ఇమంది శ్రీనివాస్ ఇమంది నందలు ప్రేమసమాజంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు, బాలికలకు చేనేత టవల్స్ మరియు నిత్యావసర వస్తువులు అందజేసినారు. ప్రేమసమాజం చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఈసందర్భంగా ఇమంది శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేతకు చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో చేనేత వస్త్రాలను పంపిణీ చేశామన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి చేయూతనిస్తున్నారని రాష్ట్ర అభివృద్ధికోసం వారు చేపడుతున్న కార్యక్రమాలను శ్లాఘించారు. అలాగే చేనేత కార్మికులకోసం కూడా చక్కని ప్రణాళికలు రూపొందించి చేనేత వస్త్రాల అభివృద్ధికి కూడా సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేత కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్షులు కంచర్ల రాంబ్రహ్మం, కార్యదర్శి కోన జగదీశ్వరరావు, సంస్థ పిఆర్ఓ ఎం.వి.రాజశేఖర్, ప్రేమసమాజం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 15న సత్యదేవుని హుండీలు లెక్కింపు

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు ది.15-7-2019 తేదీన ఉదయం 7-30 ని.లకు లెక్కించుటకు సదరు సొమ్మును బ్యాంకులో జమ చేయుటకు కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు యావన్మంది భక్తులకు,గ్రామస్థులకు తెలియజేయడమైనది.

## పారిశుద్ధ్యకార్మికుల వార్డు నూతన కమిటీ ఎన్నిక



గాజువాక: జీవీయంసీ 56వ వార్డు పారిశుద్ధ్య కార్మికుల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం వార్డులోని పినమడక ప్రభుత్వపాఠశాలలో జీవీయంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించిన అనంతరం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన కమిటీ మెంబర్లుగా ఎన్.రాజు, భాస్కర్, కొండలరావు, సత్యవతి, చిన్నారి, మేరీ, అప్పలస్వామి తదితరులు ఎన్నికైయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) అధ్యక్షులు జి.సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక వార్డుల సమస్యల కోసం ఈ కమిటీ అధ్యయనం చేసి రాబోయే మహాసభ వరకు ఈ కమిటీ ఉత్సాహాంగా పనిచేయటకు ఈ ఎన్నికలను నిర్వహించినట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ఉప్పిలి కన్నారావు నియమితులైనట్లు తెలిపారు. గాజువాక మున్సిపాలటీ 32గ్రామ పంచాయితీలో పనిచేస్తున్న 593 మంది పారిశుద్ధ్య కార్మికులకు, వీలీనమయిన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పోరేషన్ నుంచి నేటి వరకు వాళ్ళకు మినిమమ్ టైం స్కేల్ అమలుకోసం కోర్టులో కేసు ఇంకా పెండింగ్‌లో ఉందని అన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన నూతన ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసేందుకు సిఐటియు కృషి చేస్తుందని అన్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు వారి స్థానంలో కుటుంబ సభ్యులకు శాశ్వత ఉపాది కల్పించడం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సోమాదల, గణేష్, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## గత జ్ఞాపకాలను సజీవంగా ఉంచేదే 'ఫోటోగ్రఫీ'



గాజువాక: గత జ్ఞాపకాలను సజీవంగా ఉంచేదే ఫోటోగ్రఫీ అని, ఫోటోగ్రాఫర్స్‌లు సరికొత్త సాంకేతకతను ఉపయోగించి రాణించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేర్కోన్నారు. అరుకు ప్రాంతంలో ఫోటోవర్క్‌షాపు నిర్వహిస్తున్న సంధర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. గాజువాక ఫోటోగ్రాఫర్స్, విడియో గ్రాఫర్స్ ఆధర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రఫీ వృత్తిలో కొంతమంది నిలదొక్కుకున్న చాలా మంది ఆర్ధికంగా వెనుకబడివున్నారని దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఫోటోగ్రాఫర్స్ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. ఫోటో గ్రాఫర్స్ అసోసియోషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అరుకు ప్రాంతంలో ఈనెల 27,28తేదీలలో ఫోటోగ్రాఫర్స్, విడియోగ్రాఫర్స్‌కు ఫోటోగ్రాఫర్స్ టెక్నాలజీ కొరకు వర్క్‌షాపును నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోషియోషన్ ప్రతినిధులు అబ్దుల్ ఆజీం, సిమ్మామధు, అమ్మరాజు, నారాయణస్వామి, శ్రీను, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగము చేసుకోవాలి

### జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ విజాన సదస్సులో జరిగిన కార్యక్రమం లో జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రాధమిక హక్కుల పట్ల భాద్యత,చొరవ కలిగి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగము చేసుకోవాలని. సూచించారు.ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ సభ్యులు బుగత.శివ అధ్యక్షతన ఈ సదస్సులో పియన్ డిటి యాక్ట్ గురించి నల్సా అమలు చేస్తున్న కార్యక్రమాలు గురించి జడ్జి వివరించారు.అదేవిధంగా ఆవేశాలకు లోబడి అనవసర కేసులలో ముద్దాయిలుగా కోర్టు చుట్టూ తిరిగి శ్రమను,డబ్బును వృధా చేసుకోరాదని సూచించారు.క్షణికావేశంలో చేసిన తప్పులు కారణంగా ఇరికించ బడిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు అని లోక్ అదాలత్ లో ఇచ్చిన అవార్డు తీర్పును ఏ కోర్టు లోనూ సవాల్ చేయడానికి వీలు లేదని అన్నారు.

ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు కోర్టు పరిధిలో ఉన్న ప్రత్తిపాడు,కిర్లంపూడి,ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు నుండి వందలాదిలా కక్షి దారులు హాజరైనారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష,ఉపాధ్యక్షులు బుగత.శివ, ఆడారి.సుగుణ,లోక్ అదాలత్ సభ్యులు ఆర్.వి.వెంకట్రావు,న్యాయవాదులు కొప్పిశెట్టి.శ్రీనివాస్,చిట్టింశెట్టి.పుల్లయ్య,బి.జాన్ బాబు,ఆకుల.హరిబాబు,యన్.దేవి,ఆకాశపు.మ ల్లేశ్వరరావు,దేవులపల్లి. శర్మ,గౌరీశంకర్,జొన్నాడ. రాజేష్,బలరామయడం,సంబ్రహ్మణ్యం ,చలం,నాగేంద్ర మరియు ప్రత్తిపాడు సిఐ.సన్యాసిరావు,ఏలేశ్వరం, కిర్లంపూడి, అన్నవరం,ప్రత్తిపాడు సబ్ ఇన్ స్పెక్టర్లు,కోర్టు కానిస్టేబుల్స్,ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది,మండల న్యాయ సేవా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం అభివృద్ధి వైకాపాతోనే సాధ్యం



సింథియా: నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైకాపా పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ మళ్ళా విజయప్రసాద్ స్పష్టం చేసారు. శనివారం నియోజకవర్గంలోని జీవీయంసీ 45వ వార్డు ఎకేసీ కాలనీలో ఆయన పర్యటించారు. పలు సమస్యలపై ప్రజలతో చర్చించారు. ఈ సందృంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్షం కారణంగా నియోజకవర్గంలో సమస్యలు తిష్ట వేసాయని, వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌తో చర్చించి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి వైకాపాతోనే సాధ్యమని అన్నారు. గ్రామవాలంటరీ వ్యవస్థతో సమస్యలను చెక్ పెట్టవచ్చునని, లబ్దిదారులకు నేరుగా ఇంటివద్దే ప్రభుత్వ ఫలాలు అందించే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ తీసుకుంటున్న సంచలన నిర్ణయాలతో రాష్టం అభివృద్ధిపథం వైపు ఉరుకలు వేస్తుందని, వైకాపా ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. మళ్ళా వెంట వార్డు వైకాపా అధ్యక్షులు గుండపు నాగేశ్వరావు, వారాది అప్పారావు, కళింగగోవింద, అశోక్, సాయి, శ్రీను, సత్తిబాబు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు సత్వర పరిష్కారం

## నర్సీపట్నం రూరల్ సిఐ అప్పలనాయుడు



నాతవరం: పెండింగ్ కేసులు సత్వర పరిష్కారం చేయాలని నర్సీపట్నం రూరల్ సిఐ అప్పలనాయుడు అన్నారు. శనివారం నాతవరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి.సత్యనారాయణ ఉన్నారు.

## వాలంటీర్ల ఇంటర్వ్యూలకు 110 అభ్యర్థులు



గొలుగొండ: ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం గ్రామ వాలంటీర్లు ఇంటర్వ్యూలకు అభ్యర్థులు భారగా తరలివచ్చారు. లింగంపేట, పుత్తడిగైరంపేట, చీడికాడ నాగాపురం, కొంకసింగి గ్రామాలకు చెందిన 110 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వచ్చిన అభ్యర్థులను ఎంపిడిఒ డేవిడ్‌రాజు, డిప్యూటి తహశీల్దార్ ఆనందరావు, ఎంపిడిఒ కార్యాలయ పరిపాలనాధికారి రవికుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

